రు. 20/-

# చైతన్యం

సంకల్ప బలం

## సామాజిక విలువల మాసపత్రిక

ఆగస్టు 2022



75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న

స్వతంత్ర భారత్


100% ELECTRIC


CARE




వ్యవస్థాపక సంపాదకురాలు

**తీగవరపు శాంతి**


# చైతన్యం

సంకల్ప బలం

## సామాజిక విలువల మాస పత్రిక


**ఆగస్టు 2022**

సంపుటి -11 సంచిక - 11


## ఈ సంచికలో....


| | |
|---|---|
| సంపాదకీయం | 4 |
| అపవిత్ర | 7 |
| గ్రీసు దేశపు పురాణ గాథలు | 9 |
| నా తెలంగాణా భాష | 18 |
| పూరీ జగన్నాధస్వామి వైభవం | 26 |
| సందేశం | 30 |
| సుందకాండ అనుబంధం- పురగీత | 31 |
| పింగళి వెంకయ్య | 33 |
| హితోక్తులు | 37 |
| దేవదేవుని పంచభూతలింగాలు | 38 |
| సోమనాథం పెళ్లి | 44 |
| భారతదేశంలో మహిళలు | 45 |
| శ్రీ వచన భూషణం | 48 |
| (వి)నాయకత్వము | 49 |



రచనలలోని అభిప్రాయాలు రచయితలవి మాత్రమే. పత్రిక యాజమాన్యానికి ఎటువంటి సంబంధమూ లేదు.

## 76వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు

మన భారతీయులందరం 75వ స్వాతంత్ర దినోత్సవం జరుపుకుంటున్నాము. ఆగస్టు 15వ తేదీ ప్రతి భారతీయ పౌరుడికి చాలా ముఖ్యమైన రోజు. ప్రపంచంలో ఎక్కడున్నా భారతీయులందరూ ఆగస్టు 15వ తేదీన స్వాతంత్ర దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంటారు.

## 76 స్వాతంత్ర అమృత మహోత్సవం

భారత స్వాతంత్ర సాధన కోసం చేసిన పోరాటానికి అనేక దేశాల సానుభూతి లభించింది. ముఖ్యంగా జపాన్, జర్మనీ, ఇటలీ, సోవియట్ యూనియన్, అమెరికాల నుంచి కానీ ... బ్రిటిష్ వారు భారత్ ను త్వరగా వీడి వెళ్లడంలో ఓ విదేశీ హస్తం బలంగా పనిచేసింది. ఆ అదృశ్య హస్తం ...అమెరికా !

గాంధీజీ చేపట్టిన అహింస, సత్యాగ్రహాలు, అమెరికన్ మీడియాకు ఆసక్తికర వార్తలయ్యాయి. 1942 క్విట్ ఇండియా ఉద్యమం నాటికి మన స్వరాజ్య పోరాటం అమెరికా పత్రికల మొదటి పేజీ కెక్కింది. స్వతంత్ర దేశం కావాలని నిర్ణయించుకునే స్వేచ్ఛ వారికివ్వాలని 'రూజ్ వెల్ట్' స్పష్టం చేశారు. మిత్ర దేశమైన అమెరికా ఒత్తిళ్లకు తోడు యుద్ధానంతరం బ్రిటన్లో చర్చిల్ ఓటమి, బ్రిటన్ ఆర్థిక దుస్థితి కలిసి భారత్ లో వలస పాలన ముగింపునకు దారి తీశాయి

మన దేశ రాజధాని అయిన ఢిల్లీలో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా జరుగుతా-యి. ప్రతి సంవత్సరం ఢిల్లీలోని ఎర్రకోటపై జాతీయ జెండాను భారత ప్రధాన మంత్రి ఎగురవేయడం ఆనవాయితీ. ఈ సంవత్సరం 76వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా, మన ప్రధాని నరేంద్ర మోడీ గారు ఎర్రకోటపై జాతీయ జెండాను ఎగుర వేయనున్నారు. ఎర్ర కోట వద్ద మన సైనికులు చేసే సాహసాలు, విన్యాసాలు అబ్బురపరుస్తాయి. వివిధ రాష్ట్రాలకు చెందిన శకటాలు ఆయా రాష్ట్రాల పురోగతిని ప్రతిబింబిస్తుంది. మన తెలంగాణా రాష్ట్రం తరపున వ్యవసాయం కళలకు సంబంధించి శకటాలను ఎక్కువగా ప్రదర్శిస్తారు. రాష్ట్రాలకు సేవలందించిన వారిని మన ముఖ్యమంత్రి శ్రీ కె సి ఆర్ సత్కరిస్తారు.

స్వాతంత్ర దినోత్సవం అంటే కేవలం వేడుకలు జరుపుకునే రోజు మాత్రమే కాదు. ఇది దేశ భక్తి, స్వేచ్ఛ యొక్క మధురానుభూతి.

## వజ్రోత్సవాలు వైభవంగా నిర్వహిస్తాం --- ముఖ్యమంత్రి కేసీఆర్

దేశ భక్తి స్వాతంత్ర పోరాట స్ఫూర్తి ప్రజలందరిలో రగిలేలా స్వతంత్ర భారత వజ్రోత్సవాలను వైభవంగా నిర్వహిస్తామని, విద్యార్థులు,ఉద్యోగులు, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, యువతీ యువకులు సహా యావత్ తెలంగాణా సమాజం ఉత్సవాహంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. వజ్రోత్సవాల సం-దర్భంగా ఈ నెల 21న అసెంబ్లీయే ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని, అదే రోజు రాష్ట్ర వ్యాప్తంగా సమావేశాలుంటాయని, ఆగస్టు 8 నుండి 22 వరకు నిర్వహించనున్న వజ్రోత్సవ ద్విసప్తాహం కార్య-క్రమాలపై సీఎం కేసీఆర్ ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈనెల 8 నుండి 22 వరకు ప్రభుత్వ ఇతర ప్రతిష్టాత్మక భవనాలు బస్ స్టాండ్, రైల్వే స్టేషన్ సహా జన సమ్మర్ధత ప్రాంతాల్లో 15 రోజుల పాటు విద్యుత్ దీపాలు, ప్రత్యేక అలంకరణలు. 21 న అసెంబ్లీ స్థానిక సంస్థల ప్రత్యేక సమావేశాలు, 22న ఎల్బీ స్టేడియంలో వజ్రోత్సవాల ముగింపు వేడుకలు జరుగనున్నాయి.

ఈ స్వాతంత్ర దినోత్సవం రోజున స్కూల్స్ లోను, కాలేజీల్లోనూ పిల్లల్లో, దేశభక్తికి సంబంధించిన దేశభక్తి గీతాలు మాత్రమే పాడించి, దేశభక్తిని పెంపొందించే ఉపన్యాసాలు ఇవ్వడం, వారిలో దేశ భక్తికి సంబంధించిన కాంపిటీషన్స్ పెట్టడం చేయాలి. ఎటువంటి అనవసరమైన సినిమా పాటలు,

డాన్స్ లకు ప్రాధాన్యత ఇవ్వకుండా ప్రిన్సిపాల్ తగిన జాగ్రత్తలు తీసుకోవడం చాలా అవసరం.

## భారత నూతన రాష్ట్రపతిగా ద్రౌపది ముర్ము

భారత నూతన రాష్ట్రపతిగా ద్రౌపది ముర్ము భారీ మెజారిటీతో విపక్షాల ఉమ్మడి అభ్యర్థి యశ్వంత్ సిన్హా పై ఆమె విజయం సాధించారు. భారత దేశానికి ఆమె రెండో మహిళా రాష్ట్రపతి. గిరిజన సామాజిక వర్గం నుంచి అత్యున్నత రాజ్యాంగ పదవికి ఎన్నికైన మొట్టమొదటి వ్యక్తిగా ద్రౌపది ముర్ము చరిత్ర సృష్టించారు. భారత రాష్ట్రపతిగా ఎన్నికైన సందర్భంగా ఆమెకు ప్రధాని మోదీతో పాటు కేంద్ర మంత్రులు, ఎంపీలు, బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు శుభాకాంక్షలు తెలిపారు. ప్రధాని మోదీ స్వయంగా ఆమె ఇంటికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు.

## ద్రౌపది ముర్ము జూలై 26న ప్రమాణ స్వీకారం చేశారు

భారత దేశ 15వ రాష్ట్రపతిగా ప్రమాణ స్వీకారం చేయించారు భారత దేశ అత్యున్నత న్యాయస్థాన ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ. అనంతరం పదవీ పత్రాలపై ఆమె సంతకం చేశారు. నూతన రాష్ట్రపతిగా ప్రమాణ స్వీకారం చేసిన ద్రౌపది ముర్ముకు నరేంద్ర మోదీ అభినందనలు తెలిపారు. దేశానికి ఇదొక ఉద్వేగ భరిత క్షణాలని హర్షం వ్యక్తం చేశారు.

ముర్ము రాష్ట్రపతి హోదాలో తొలి ప్రసంగం ఈ విధంగా సాగింది. నాపై మీరు చూపిన ప్రేమ, అభిమానం, నమ్మకం రాష్ట్రపతి బాధ్యతలు నిర్వహించడానికి ప్రోత్సహిస్తాయి. దేశ ప్రజల విశ్వాసం నిలబెట్టేందుకు కృషి చేస్తా. మా గ్రామంలో పదవ తరగతి చదువుకున్న మొదటి బాలికను నేను. భారత్ ప్రగతి పథంలో నడుస్తోంది. ఇంకా వేగంగా అభివృద్ధి చెందాలని ఆశిస్తున్నాను.

కొత్తగా ఎన్నికైన రాష్ట్రపతికి కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ట్విట్టర్లో భారత 15వ రాష్ట్రపతిగా ప్రమాణ స్వీకారం చేసిన ద్రౌపది ముర్ముకు అభినందనలు తెలిపారు. ముర్ము తన పదవీకాలంలో దేశ కీర్తిని ఉన్నత శిఖరాలకు తీసుకు వెళుతుందని నమ్మకం ఉందన్నారు. నేడు చరిత్రలో నిలిచిపోయే రోజు అని అన్నారు. రాష్ట్రపతి ముర్ము ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్ లో ప్రమాణ స్వీకారం చేసిన తరువాత ... ఆమె మొదటి గార్డ్ ఆఫ్ ఆనర్ ను తనిఖీ చేశారు.

పార్లమెంట్ హాల్ నుండి గుర్రపు కవాతు నడుమ అధికారిక వాహనంలో ద్రౌపది ముర్ము రాష్ట్రపతి భవన్ కు జేరారు.

## కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి రాజీనామా

కాంగ్రెస్ పార్టీకి, శాసనసభ సభ్యత్వానికి కోమటి రెడ్డి గోపాల్ రెడ్డి రాజీనామా నేపథ్యంలో మునుగోడు ఉప ఎన్నిక తప్పనిసరి అవుతోంది. వచ్చే ఏడాది జరగనున్న శాసనసభ ఉప ఎన్నికల ముందు జరగనున్న ఈ పోరును ప్రధాన పార్టీలు కీలకంగా భావిస్తున్నాయి. భాజాపా అభ్యర్థిగా రాజగోపాల్ రెడ్డి బరిలో దిగ నుండగా తెరాస, కాంగ్రెస్ అభ్యర్థులు ఖరారు కావాల్సి ఉంది.

ఇక్కడ విజయం సాధించడాం ద్వారా రాష్ట్రంలో తాము ప్రత్యామ్నాయ శక్తిగా మారాలని భాజాపా భావిస్తుండగా ... గత ఎన్నికల్లో కోల్పోయిన ఈ స్థానాన్ని మళ్ళీ దక్కించుకోవాలని తెరాస పట్టుదలగా ఉంది. క్షేత్ర స్థాయి బలంతో స్థానాన్ని నిలబెట్టుకోగలమని కాంగ్రెస్ ఆశిస్తోంది. అభ్యర్థి ఎన్నిక మాత్రం సవాల్ గానే ఉంది

## సీడ్స్ దుస్తుల కంపెనీలో విషవాయువు కలకలం

అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం ప్రత్యేక ఆర్థిక మండలి సీడ్స్ దుస్తుల కంపెనీలో మరోసారి విషవాయువుల కలకలం రేపింది. ఈ ఏడాది జూన్ 3న ఇదే కంపెనీలో విషవాయువు లీకై 469 మంది

మహిళా కార్మికులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. తాజాగా అదే కంపెనీలో బి షిఫ్టులో పని చేస్తున్న 150 మంది మహిళా ఉద్యోగులు తీవ్రంగా అస్వస్థతకు గురయ్యారు. మరో మూడు గంటల్లో విధులు ముగుస్తాయనగా ... గాఢమైన విషవాయువు విడుదలై మహిళా కార్మికులు ఉక్కిరి బిక్కిరి అయ్యారు. ఒకేసారి పదుల సంఖ్యలో మహిళలు స్పృహ తప్పి పడిపోవడంతో కంపెనీలో ప్రాథమిక చికిత్స అందిచ్చారు. ఇంతవరకూ ప్రమాదానికి కారణాలు, విషవాయువు ఎక్కడనుండి విడుదలైందో ఇంకా చెప్పలేదు. పెద్ద పెద్ద కంపెనీలన్నీ సరియైన జాగ్రత్తలు తీసుకోక పోవడంతో, ముఖ్యం గా సామాన్య ప్రజలు ప్రాణాలు కోల్పోవడమే కాక, ఆ కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ప్రభుత్వం, నిపుణులైన ఉద్యోగులు వీటికి నివారణ చర్యలు తీసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.

## తైవాన్ లో అడుగు పెట్టిన నాన్సీ పెలోసీ --- డ్రాగన్ హెచ్చరిక బేఖాతరు

తైవాన్ అంశంలో అమెరికా -- చైనా దేశాల మధ్య వివాదం తారాస్థాయికి చేరింది. అగ్ర రాజ్యం అమెరికా ప్రతినిధుల సభ స్పీకర్ నాన్సీ పెలోసీ ఆసియా పర్యటన నేపథ్యంలో ఈ వివాదం మరింత ముదిరింది. తైవాన్ లోఅడుగుపెడితే అమెరికా తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని డ్రాగన్ హెచ్చరించిన నేపథ్యంలో నాన్సీ పెలోసీ తైపీ విమానాశ్రయంలో అడుగు పెట్టారు. నాన్సీ పెలోసీ తైపీలో పర్యటన విషయంలో వెనక్కి తగ్గేదే లేదు అంటూ అమెరికా తేల్చి చెప్పడంతో చైనా సైన్యం దూకుడుగా వ్యవహరిస్తోంది. నాన్సీ పెలోసీ తైవాన్ పర్యటన అత్యంత ప్రమాదకర మని చైనా మండి పడుతోంది. డ్రాగన్ హెచ్చరికలతో అప్రమత్తమైన అమెరికా ...నాన్సీ పెలోసీ పర్యటనకు ముందే అక్కడ నాలుగు యుద్ధ నౌకలను తైపీ సమీపంలోని సముద్ర జలాల్లో మోహరించినట్లు తెలుస్తోంది.

## వర్షాకాలంలో ప్రజలు పడే బాధలు వర్ణనాతీతం

వర్షం పడితే చాలు ప్రజలు, వాహనాలు రోడ్లపై వచ్చే పరిస్థితి లేక అవస్థలు పడుతున్నారు. లోతట్టు ప్రాంతాల్లో ఉన్నవారు ఇళ్లల్లో కూడా నీరు చేరి, వారి జీవనం కష్టసాధ్యంగా ఉంటోంది.

75 సంవత్సరాల స్వాతంత్ర పరిపాలనలో ఇంకా ప్రజలు పేదరికం లో కొట్టుమిట్టాడుతున్నారు. స్త్రీలు ఇంకా వివక్షకు, అన్యాయాలకు గురౌతూనే ఉన్నారు.

అన్నివిషయాలలో పురుషులతో సమానత్వానికి నోచుకోని వారే అధికశాతం ఉండడం దురదృష్టకరం.



విద్యార్థులు ఎంతో కష్టపడి చదువుకున్నా, వారి తెలివి తేటలు మనం ఉపయోగించుకోక, విదేశాలకు వినియోగించడం కూడా అత్యంత బాధాకరం అనే చెప్పాలి. ఈ బాధ్యత ప్రభుత్వం నిర్వహించాలి. అలాగే ఇన్నాళ్ల స్వాతంత్ర విజయోత్సవాలు జరుపుకుంటూ కూడా ఇంకా బిచ్చగాళ్ళు రోడ్ల పైన అడుక్కోవడం, ప్లేట్ ఫారం లే వారి ఇల్లుగా జీవనం సాగించడం అమానుషం. శారీరకంగా శక్తి ఉన్న వారి చేత తగిన పనులు చేయిస్తూ, అసలు ఏ పని చేయలేని వారికి షెల్టర్ ఏర్పాటు చేసి, రోడ్ల మీద , ప్లేట్ ఫారమ్ మీద కానీ ఎక్కడ పడితే అక్కడ బిచ్చగాళ్లు లేకుండా చేయవలసిన బాధ్యత ప్రభుత్వం త్వరలో చేపట్టాలని చైతన్యం సంకల్పబలం కోరుకుంటోంది.

సర్వేజనా సుఖినోభవంతు

తీగవరపు శాంతి

# అపవిత్ర



భువనచంద్ర

"కథ చెప్పు తాతయ్యా" ముద్దుగా అడిగాడు పుండరీ. పుండరీ పూర్తిపేరు పుండరీకాక్షుడు. "అపవిత్ర పవిత్రోవా సర్వావస్థాం గతోపివా, యస్మరేత్ పుండరీకాక్షం సబాహ్యాభ్యంతరశ్శుచి:' అన్న శ్లోకం స్ఫూర్తిగా తీసుకుని ఆ పేరు పెట్టాడు సోమసుందరశర్మ. అంటే ఆ తాతగారన్నమాట.

"సరే... ఓ పెద్ద అడవి వుంది. ఆ అడవిలో ఓ సింహం వుంది. దాని పేరు 'శత్రుజిత్'" కథ మొదలుపెట్టాడు శర్మగారు.

"తాతయ్యా సింహాలకీ మనుషుల్లాగా పేర్లుంటాయా?" ఆశ్చర్యంగా అడిగాడు పుండరీ.

"ఎందుకుండవూ? వాటి భాషలో అవి పేర్లు పెట్టుకుంటాయి." నవ్వి అన్నాడు శర్మగారు.

"నేను నమ్మను" తల అడ్డంగా ఊపాడు పుండరీ.

"సరే... మనం ఇప్పుడు మన బుజ్జి దూడ భద్రుడ్ని తీసుకుని ఆశ్రమం వెనకాల వున్న చెరువు గట్టుకి పోదాం" లేచి అన్నాడు శర్మగారు.

"భలే" ఉత్సాహంగా, భద్రుడ్ని కట్టేసిన గొడ్లపాక దగ్గరకి పరిగెత్తాడు పుండరీ. ఇరవై నిమిషాల తరవాత ఇద్దరూ చెరువుగట్టు దగ్గరకి వచ్చారు. వందలకొద్దీ ఆవులు గేదెలు ఎద్దులు దున్నపోతులూ ఆ చెరువుగట్టుకి ఆవలివైపు నున్న విశాలమైన మైదానంలో గడ్డి మేస్తున్నాయి. భద్రుడు పలుపు తెంచుకోవడానికి మహా ప్రయత్నం చేస్తున్నాడు.



"ఎందుకు తాతయ్యా యీ దూడ అంతగా నన్ను కూడా లాగేస్తోందీ" అడిగాడు పుండరీ.

"వాళ్ళ అమ్మ ఇక్కడుందని భద్రుడికి తెలిసిపోయింది" నవ్వి అన్నాడు శర్మగారు.

"ఎలా" అడిగాడు పుండరీ.

"అదే మరి. ఇప్పుడు దాని పలుపు విప్పేయ్" అన్నాడు శర్మగారు.

పలుపు విప్పేశాడు పుండరీ. ఒక్క ఉదుటున మందలికి దూరిపోయింది తువ్వాయి.

"మనం ఎలా పట్టుకోగలం దాన్నీ? పారిపోయిందిగా?" కంగారుగా అన్నాడు పుండరీ.

"డోంట్ వర్రీ.... అది సరాసరి వెళ్ళింది వాళ్ళమ్మ దగ్గరికే. కావాలంటే చూపిస్తా" మైదానంలోకి అడుగు పెడుతూ అన్నారు శర్మగారు.

"ఇన్ని వందల ఆవుల్లో వాళ్ళ అమ్మని ఎలా గుర్తు పడుతుందీ ?" ఆశ్చర్యంగా అన్నాడు పుండరీ.

"అదే మరి. జీవులన్నీ తమ తల్లుల్ని ఖచ్చితంగా గుర్తుపడతాయి. అదే సృష్టి విచిత్రం. మనం పేర్లు పెట్టుకుంటాం గుర్తించటానికీ గుర్తింపబడటానికీ. వాటికి పేర్లు అక్కరలేదు. కానీ మనకన్నా గొప్పగా గుర్తుపడతాయి. ఓ చిన్న కుక్కపిల్ల కూడా తన యజమానినీ యజమాని పిల్లల్నీ

వీధినీ ఇళ్లనీ కూడా స్పష్టంగా గుర్తుపట్టగలదు" తిరిగి గట్టెక్కుతూ అన్నారు శర్మగారు.

"తాతయ్యా... అది సరే. దేవుడు ఉన్నాడనీ, కానీ ఆయనకి రూపం లేదనీ, నామాలు కోటానుకోట్లు ఉన్నా, ఆయనను గుర్తించాలంటే ఆ నామాలు ఉపయోగపడవనీ ఓ సన్యాసి గారు ఆశ్రమంలో అన్నారు కదా. నోరులేని దూడ తన తల్లిని సునాయాసంగా గుర్తించినప్పుడు, మనం దేవుడిని ఎందుకు గుర్తించలేమూ?" అడిగాడు పుండరీ. నవ్వారు శర్మగారు.

"ఇదే ప్రశ్నకి సత్యసాయిబాబా వారు చక్కని సమాధానం చెప్పారు. పూరీలో చపాతీలో తందూరీలో ఇంకా అనేకానేక వంటల్లో ఉన్నది గోధుమపిండే. కానీ ఏ తినిబండారాన్నీ మనం గోధుమపిండి పేరుతో పిలవం. గోధుమ దోసె అంటాం. గోధుమ హల్వా అంటాం. అలాగే అన్ని జీవుల్లో అంతర్లీనంగా ఉన్న భగవంతుడ్ని పేర్లతో పిలుస్తామే గానీ, ఆత్మగా, దైవంగా గుర్తించం.

అందుకే పెద్దలు చెబుతారు. చాలామంది దేవుళ్ళకి సహస్రనామాలు ఉన్నాయి. ఏదో ఒకటి గుర్తున్నా చాలు. అన్నీ గుర్తుంటే ఇంకా మంచిది. అలాగే ఉంగరం వడ్డాణం, గొలుసు, జుంకీలు, పాపిటబిళ్ళ ఇలా నగలు ఎన్ని వున్నా బంగారం ఒక్కటే. నామాలు ఎన్ని వున్నా జీవాలు ఎన్ని వున్నా వున్నది ఒక్కటే. ఒక్క చైతన్యం మాత్రమే" ఒక్క క్షణం ఆగారు శర్మగారు.

ఒక పెద్ద త్రాచుపాము హడావిడిగా పాకుతూ పోతోంది. ఎంత పెద్దదంటే కనీసం ఎనిమిది తొమ్మిది అడుగుల పొడవుంటుంది.

"బాబోయ్" గట్టిగా అరిచాడు పుండరీ.

"ఎందుకూ అరవడం" వాటి చోటులోకి మనం వచ్చాం కానీ మన చోట్లోకి అవి రాలేదు. కంటికి కనపడని అత్యంత హానికరమైన సూక్ష్మజీవుల్ని కప్పలు తింటే కప్పల్ని పాములు తిని కప్పల సంతానం కోటానుకోట్లగా పెరగకుండా నియంత్రిస్తాయి. అలాగే కప్పల్నీ ఎలకల్నీ చిన్నచిన్న కీటకాల్నీ మింగే పాముల్ని గద్దలు భక్షిస్తాయి. ఈ పాములే లేకపోతే చెమటోడ్చి రైతు పండించిన పంట అంతా ఎలుకలు మింగేస్తాయి. చిత్రం ఏమంటే మనిషి తనకి మేలు చేసే కప్పల కాళ్ళు విరచి విదేశాలకు ఎగుమతి చేస్తున్నాడు. పాము తోళ్ళు తీసి మనీపర్సులుగా బెల్టులుగా మారుస్తున్నాడు. నాయనా మనం భయపడాల్సింది జంతువులకూ పక్షులకూ, పాములకూ కాదు. ప్రకృతిని సర్వనాశనం చేస్తున్న మనిషిని చూసి భయపడాలి" ఆగారు శర్మగారు.

అలాగే ఏనుగు దంతాల్నీ, పులి చర్మాల్నీ, నక్క పళ్ళనీ, పులి, చిరుతపులి గోళ్ళనీ, దేవుడా ఎన్ని విధాలుగా భగవంతుడు సృష్టించిన ప్రకృతిని వికృతం చేస్తున్నాడో. నువ్వు కథ చెప్పమన్నావు కదూ... మానవుల్లోనే కొందరు మహానుభావులు దేవతలై మానవాళి కోసం తపస్సు చేసి విజ్ఞానాన్ని ప్రసాదిస్తే మానవుల్లోనే కొందరు రాక్షసులై తమ విజ్ఞానాన్ని అజ్ఞానంగా మార్చుకుని ప్రకృతిని మనుషుల్నీ కూడా ధ్వంసం చేస్తున్నారు. మానవుడు మానవుడిగా మెలగాలంటే మానవత్వం పెంచుకోవాలి. మానవత్వమంటే ప్రేమ అహింస సత్యం ధర్మం శాంతి, ప్రకృతి మీద గౌరవం, తోటి జీవుల పట్ల ప్రేమ అనురాగం - ఇవన్నీ పెంచుకున్ననాడు ప్రకృతీ మనుషులు కూడా పచ్చగా ఉంటారు. లేకపోతే భస్మాసురుల్లాగా మనకి మనమే ధ్వంసం అవుతాం!" ఓ చెట్టునీడలో అన్నారు శర్మగారు.

"నా పేరుకి అర్థం చెప్పావు గదా... ఆ శ్లోకం ఎప్పుడు పఠించాలీ" అడిగాడు పుండరీ.

"నీ మనసులో చెడు తలంపు వచ్చినా కూడా పఠించాల్సిందే. అపవిత్రమైన మనో, శరీరాల్ని శుభ్రపరచడానికి చదివే శ్లోకం అది. చదివి ఓ నాలుగు చుక్కల నీటిని తలమీదా శరీరం మీదా చల్లుకుంటే దుష్టపు ఆలోచనలు రానేరావు కదా!" నవ్వారు శర్మగారు.

"అసలు కథ అదే. శత్రుజిత్ కథ ఏమైందీ" అడిగాడు పుండరీ.

"ఈనెలకి కంచికి వెళ్ళింది. మళ్ళీ వస్తుందిలే. ఇంటిదారి పట్టారు శర్మగారు.

మళ్ళీ కలుద్దాం.

భువనచంద్ర

# గ్రీసు దేశపు పురాణ గాథలు




## వేమూరి వేంకటేశ్వరరావు


**"Knowledge is acquired when we succeed in fitting a new experience into the system of concepts based upon our old experiences. Understanding comes when we liberate ourselves from the old and so make possible a direct, unmediated contact with the new, the mystery, moment by moment, of our existence."**

**Aldus Huxley. "Knowledge and Understanding"**


## ముందు మాట

నేను ఈ వ్యాసాలు రాయడానికి ప్రేరణ కారణం ఒక విమాన ప్రయాణం. భారత దేశం వెళుతూ, శేన్ ఫ్రాన్సిస్కో లో ఉదయం **8** గంటలకి బయలుదేరి, నూ అర్క్ చేరునేసరికి సాయంత్రం అయిదు అయింది. పరుగుబాట మీదకి దిగడానికి విమానం సంసిద్ధం అవుతూ ఉండగా, "మనం దిగబోయే పరుగుబాట మీద మరొక విమానం ఉంది. కంట్రోలు టవర్ లో ప్రజలు నిద్రపోతున్నట్లు ఉన్నారు. మరో చుట్టు తిరిగి వస్తాను. అరగంట సేపు ఓపిక పట్టండి," అని చోదకుడు విమానం జోరు పెంచుతూ పైకి లేచేసరికి ఇహ చేసేది ఏమీ లేకపోవడంతో నా కుర్చీకి ఎదురుగా ఉన్న టి.వి. లో ఏదైనా "ఇరవై నిమిషాల కార్యక్రమం" చూద్దామని వెతకడం ఉపక్రమించేను. "అపస్వరం అనే ఏపిల్ పండు కథ" ట. పదిహేను నిముషాలు ట. చూడడం మొదలు పెట్టేను.
పురాతన గ్రీసు దేశపు కథ. ఇంతకు పూర్వం నేనెప్పుడూ ఈ కథ గురించి వినలేదు. ఆసక్తితో చూసేను. గమ్యం చేరుకోగానే గూగుల్ లో వెతికేను. చాల ప్రాచుర్యం ఉన్న కథ. మా అమ్మాయిని అడిగితే, "చిన్నప్పుడు హైస్కూల్ లో చదివేను" అని చెప్పింది. నేను పుస్తకాల పురుగుని అయినా ఈ కథ నా కళ్ళ పడడానికి ఎనభై ఏళ్ళు పట్టిందంటే ఈ కథని వినని వాళ్ళు ఇంకా ఎంతమంది ఉంటారో అనిపించింది. ఈ కథ గురించి పరిశోధన చేస్తూ ఉంటే ఆసక్తికరమైన అంశాలు ఎన్నో తెలుసుకున్నాను. వాటన్నిటిని క్రోడీకరించి వ్యాసాలుగా రాసేను.
ఇక్కడ ఉటంకించిన అంశాలన్నిటినీ కేవలం ఒక నఖచిత్రంలా స్పర్శించినా ఇది పెద్ద గ్రంథం అవుతుంది. అందుకని కొన్ని ముఖ్యమైన అంశాలని మాత్రమే ముచ్చటించేను.

వేమూరి వేంకటేశ్వరరావు
ప్లెజంటన్, కేలిఫోర్నియా

# 20. గ్రీకు తత్త్వవేత్తల ప్రాదుర్భావం







బొమ్మ. గ్రీసు తత్త్వవేత్తలు (గూగుల్ సౌజన్యంతో)



బురద లోంచి తామర పువ్వు పుట్టుకొచ్చినట్లు పురాణగాథలలో ములిగి తేలుతున్న గ్రీసు సమాజంలో అకస్మాత్తుగా విప్లవ వీచికలు తెరలు తెరలుగా తలెత్తడం మొదలయింది. ముందస్తుగా గ్రీసు చరిత్రలో కాలరేఖని ఒక సారి సమీక్షిద్దాం. గ్రీకు దేవతలు అస్తవ్యస్తత నుండి ఎప్పుడు పుట్టుకొచ్చేరో, ఒలింపస్ పర్వతం మీద ఎప్పుడు స్థిరపడ్డారో మనకి తెలియదు. కానీ ట్రోయ్ యుద్ధం జరిగేనాటికి (ఉరమరగా సా. శ. పూ.1100) ఆ సమాజంలో ఆ దేవతల కథలు, ఆ నమ్మకాలూ స్థిరపడిపోయాయి. ఆ నమ్మకాలని ఆధారంగా చేసుకుని హోమర్ తన ఇలియాడ్, ఆడెస్సి అనే గ్రంథాలని మౌఖిక ధోరణిలో (ఉ. సా. శ. పూ. 800 లో) రచించి ఉంటాడు. ఈ మౌఖిక సాహిత్యం గ్రంథరూపం దాల్చేసరికి మరికొంత కాలం పట్టి ఉండొచ్చు.

వీటన్నిటిని ఆధారంగా చేసుకుని హేసియోడ్ తన చరిత్రని (ఉ. సా. శ. పూ. 700 లో) రాసి ఉంటాడు. డెల్ఫై లో ఉన్న ఓరకిల్ మీద నమ్మకాలు అలెగ్జాండర్ కాలం వరకు ఉన్నట్లు దాఖలాలు ఉన్నాయి కాబట్టి ఈ కథలు, ఈ నమ్మకాలు అలెగ్జాండర్ (ఉ. సా. శ. పూ. 350) కాలం వరకు ప్రచారంలో ఉన్నాయని మనం తీర్మానించవచ్చు.

ఇలాంటి వాతావరణపు నేపథ్యంలో మేఘాలు లేని ఆకాశం నుండి మెరుపులు మెరిసినట్లు, పిడుగులు పడ్డట్లు గ్రీకు సమాజంలో పెను మార్పు - విప్లవాత్మకమైన మార్పు - చోటు చేసుకోవడం మొదలయింది. వీటిని అర్థం చేసుకోవాలంటే గ్రీసు దేశపు చరిత్రని కొన్ని “యుగాలు” గా విభజించి అధ్యయనం చెయ్యడం సాంప్రదాయికంగా వస్తున్న ఆచారం. ఈ యుగాలని ఈ దిగువ పట్టికలో చూపెడు-




తున్నాను. (ఇక్కడ BCE అంటే Before the Common Era లేదా లేదా క్రీస్తు శకానికి పూర్వం (క్రీ. శ. పూ.) అని అర్థం. చూపిన సంవత్సరం పెద్దది అయినకొద్దీ కాలరేఖ మీద వెనక్కి వెళుతు-న్నామని గుర్తు పెట్టుకోవాలి.)

నవశిలా యుగం (Neolithic Period, 6000-2900 BCE)

కాంస్య యుగం (Early Bronze Age, 2900 – 2000 BCE)

మినోవా యుగం (Minoan Age, 2000-1400 BCE)

మైసీనియా యుగం





(Mycenaean Age, 1100 – 600 BCE)

అంధకార యుగం (The Dark Ages, 1100 – 750 BCE)

ప్రాచీన యుగం (Archaic Period, 750 – 500 BCE)

సంప్రదాయిక యుగం (Classical Period, 500 – 336 BCE)

యూనాని యుగం (Hellenistic Period, 336 – 146 BCE)

సా. శ. పూ. 323 లో అలెగ్జాండర్ మృతి తరువాత నుండి సా. శ. పూ. 31 లో రోమన్ సామ్రాజ్యం ఏర్పడేవరకు గల కాలాన్ని చరిత్రలో యూనాని యుగం (Hellenistic Period) అంటారు. ఇవన్నీ ఉరమర లెక్కలే - కొద్దీ దశాబ్ధాలు ఇటు అటుగా! పాఠకులు అర్థం చేసుకోడానికి వీలుగా మనకి పరిచయం ఉన్న కొన్ని సంఘటనలు, కొందరు వ్యక్తుల జీవిత కాలాలు ఈ కాలరేఖ మీద ఉంచుదాం.

కలియుగం మొదలు (3300 BCE)

సింధు నాగరికత: (3300 –1300 BCE)

హోమర్ (800 – 700 BCE)

థేల్స్ (624 – 548 BCE)

అనాక్సిమేండర్ (610 – 546 BCE )

పైథాగోరోస్ (570 – 495



BCE)

కన్ఫ్యూషియస్ (551– 479 BCE)

గౌతమ బుద్ధుడు (500 – 400 BCE)

ఎంపిడోక్లీస్ (490 - 430 BCE)

సోక్రటీస్ (470 – 399 BCE)

ప్లేటో (428 - 348 BCE)

అరిస్టాటుల్ (384–322 BCE)


అలెగ్జాండర్ (336 – 323 BCE)

మౌర్య సామ్రాజ్యం (321– 185 BCE)

ఆర్కిమిడీస్ (287 – 212 BCE)

సింధు నాగరికత అవసాన దశలో ఉన్న రోజులలో "మైసీనియా యుగం" మొదలయింది. మైసీనియా యుగం తొలి రోజులలో ట్రోయ్ మహా సంగ్రామం జరిగిందనడానికి ఆధారాలు దొరుకుతున్నాయి. తరువాత గ్రీసు దేశం దరిదాపు నాలుగున్నర శతాబ్దాలపాటు "అంధకార యుగం"లో - పురాణకథల ప్రభావంలో పడి - మగ్గిన తరువాత హోమర్ అప్పటికే ప్రచారంలోఉన్న కొన్ని కథలని గ్రంథస్థం చేసి "ప్రాచీన యుగం" కి పైతాళికుడయ్యాడు. తరువాత వచ్చిన "సంప్రదాయిక యుగం" లో పెద్ద పెట్టున శాస్త్రీయ దృక్పథం పెరిగింది. తరతరాలుగా ప్రజలలో పాతుకుపోయిన ఆచార వ్యవహారాలని కొంతమంది ప్రశ్నించడం మొదలు పెట్టేరు. అయినా సరే "యునాని యుగం"లో అలెగ్జాండర్ భారతదేశపు సరిహద్దులకి వచ్చే వరకు గ్రీసు దేశపు ప్రజల మీద పురాణగాథల పట్టు సడల లేదు.

చరిత్రలో, చాల కాలం పాటు, ప్రపంచం నలుమూలల సత్యాన్వేషణ, భగవదాన్వేషణ అన్నవి పర్యాయ పదాలుగా వాడడం జరిగింది. భగవంతుని ప్రస్తావన తీసుకుని రాకుండా కేవలం



ప్రకృతి సత్యాలని గురించి తెలుసుకోవాలనే కుతూహలం పుట్టేసరికి కొంత కాలం పట్టింది.

అది గౌతమ బుద్ధిని కాలం. ఎందువల్లనో ప్రపంచంలో, పలు చోట్ల, తార్కికమైన చింత బాగా పెరిగింది. దేవుడనే భావం మీద ఆధారపడకుండా, కంటికి ఎదురుగా ఉన్న సృష్టి విచిత్రాన్ని అవగాహన చేసుకుందుకి మానవుడు ప్రయత్నించేడు. భారతదేశంలో గౌతమ బుద్ధుడు, చైనాలో కన్ఫుషియస్ , గ్రీసు దేశంలో థేల్స్, అనాక్సిమేండర్, మొదలైన వారు సమకాలీకులవడం గమనార్హం!

భారతదేశంలో బౌద్ధ ధర్మం కార్య-కారణ వాదానికి విత్తులు నాటడం మొదలు పెట్టింది. "ఇది కీలకమైన సంఘటన. ప్రకృతికి అతీతమైన దానిని తిరస్కరిస్తూ బుద్ధుడు మూడు విధానాలు చెప్పాడు. మానవుడిని హేతువాద దృక్పథం వైపు నడిపించడం మొదటిది. మానవుడిని సత్యాన్వేషణ వైపు స్వేచ్ఛగా పయనింప చేయడం రెండవది. మూఢ-నమ్మకాలను అనుసరించడం ద్వారా మానవుడు అన్వేషణా శక్తిని కోల్పోతాడు అని చెప్పడం మూడవది. దీనినే కర్మ సిద్ధాంతం లేదా కార్య-కారణ సిద్ధాంతం (cause - effect theory) అంటారు. బౌద్ధ ధర్మంలో కార్య-కారణ సిద్ధాంతం అత్యంత కీలకమైంది. బౌద్ధ ధర్మం హేతువాద బద్ధం కానట్లయితే అది బౌద్ధమే కాదు. అందుచేత ప్రకృతికి అతీతమైన వాటిని నమ్మడం ధమ్మం కాదు." (బుద్ధుడు మరియు అతని ధమ్మం, (సం.) పేర్వారం జగన్నాథం, "డాక్టర్ బాబాసాహెబ్

అంబేద్కర్ రచనలు, ప్రసంగాలు," తెలుగు విశ్వవిద్యాలయం, 1994, సంపుటం 11, పుట 222).

ఇదే సమయంలో చైనాలో కన్ఫుషియస్ మరొక దారి చూపేడు. పెద్దల యెడల, కుటుంబ సభ్యుల యెడల, దేశం యెడల గౌరవ ప్రపత్తులతో మెలగాలి అన్నది మొదటి సూత్రం. నేటికీ పెద్దల యెడల, అధికారుల యెడల చైనా వారు చూపే గౌరవ మర్యాదలు శ్లాఘనీయం. కుటుంబాభిమానం వారిలో ఎక్కువ. కలిసికట్టుగా సంఘ శ్రేయస్సు కోసం పాటుపడడం అనేది కన్ఫుషియస్ ఆలోచనకి మూల స్తంభం. కుటుంబం కోసం, సంఘం కోసం, దేశం కోసం సమష్టిగా పని చెయ్యాలి. వ్యష్టిగా ఎవరి "మోక్షం" కోసం వారు విద్యార్జన, ధనార్జన చేస్తే సరిపోదు; సంఘ శ్రేయస్సు కోసం సమష్టిగా కూడా పని చెయ్యాలి.

ఈ రకం ధర్మ సూక్ష్మాలు హిందువులకి తెలియనివి కావు. ఉదాహరణకి:

ఒరులేయవి యొనరించిన
నరవర యప్రియము దనమనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి
పరాయణము పరమధర్మ పదములకెల్లన్ (భారతం, శాంతి, 5-220)


హిందూ దృక్పథంలో, "మానవ సేవే మాధవ సేవ" అన్న సూక్తి కేవలం ప్రచారం కోసం "బేనర్" మీద రాసుకుందుకే! "మనం ఉండే సంఘం బలంగా ఉంటే అదే మన బలం" అనే ఆలోచన మనలో తక్కువ. "ఎవరి కర్మ వారిది" అనే వేదాంత ధోరణిలో ఉన్న వారికి సంఘంతో పనేమిటి? మన నుదిటి రాత బాగులేకపోతే ఆ రాసినవాడి దగ్గరకే వెళ్లి వాడికే కాసింత లంచం ఇస్తే సరిపోలే? రెండు వందల సంవత్సరాల బ్రిటిష్ సంపర్కం ఉన్నప్పటికీ అది సంఘానికీ, వ్యక్తికీ మధ్య ఉన్న పరస్పరాధార బంధంపై మన దృక్పథాన్ని మార్చలేకపోయింది.

కానీ ఇదే దేశంలో తరతరాలబట్టి స్థిర నివాసం ఏర్పరచుకున్న పార్శీలు వితరణ శీలానికి, సంఘాభ్యుదయనికీ మధ్య ఉండే లంకె బాగా అర్థం చేసుకున్న వ్యక్తులు. అభివృద్ధి అనేది వ్యష్టిగా కాక సమష్టిగా జరగవలసిన కార్యక్రమం అని వారు గుర్తించేరు. ఈ అభ్యుదయ దృక్పథంతో వారు మన దేశపు పునర్నిర్మాణానికి అవసరమైన సంస్థలు ఎన్నో స్థాపించేరు.

ఈ తర్జనభర్జనలని పక్కకి పెట్టి, బుద్ధుడి కాలానికి తిరిగి వెళదాం. ఆ కాలంలో ఆధునిక వైజ్ఞానిక దృక్పథానికి ఆద్యుడు అనదగ్గ గ్రీకు తత్త్వవేత్త థేల్స్, "ఈ ప్రపంచం దేనితో తయారయింది?" అని ఒక సారి ప్రశ్నించేరు. మేఘాలు, మృగాలు, వృక్షాలు, ఇలా వివిధ రూపాలలో కనిపిస్తూన్న ఈ స్థూల ప్రపంచం అంతా సూక్ష్మ రూపంలో ఒక్కటేనా? (జోసెఫ్ కెంప్^బెల్ 20 వ శతాబ్దంలో ప్రతిపాదించిన monomyth కి ఇది సమాంతరంగా భావం!) మనకి దృగ్గోచరమయే బహుళత్వంలో ఏకత్వం ఉందా? సృష్టి అంతా మన మేధకి అందనంత క్లిష్టమైనదా లేక విశ్లేషించి అధ్యయనం చేస్తే అర్థం అవుతుందా? ఇటువంటి ప్రశ్నలతో ఆయన చాల కాలం కుస్తీ పట్టేరు. మట్టితో ఇటికలు చేసి, ఆ ఇటికలని మూల పదార్థంగా వాడి రకరకాల ఆకారాలలో గోడలు, ఇళ్లు, గుడులు, గోపురాలు కట్టినట్లే సృష్టిలో మనకి కనిపించేవన్నీ – అంటే, మేఘాలు, మృగాలు, వృక్షాలు, వగైరాలు – ఒక మూల పదార్థంతో తయారయి ఉండాలని ఆయన వాదించేవారు. ఆ మూల పదార్థం ఏదయి ఉంటుంది? ఆయన సముద్రపు ఒడ్డున నివసించేవారు. రోజూ

ఎదురుగా ఉన్న మహాసాగరాన్ని చూసి, చూసి సృష్టికి మూలం నీరు అన్నారు. అంటే, ప్రపంచంలోని పదార్థాలన్నీ నీటితో తయారు చెయ్యబడ్డాయని ఆయన ఆలోచన. సృష్టికి మూలం జలం. సర్వవ్యాప్తమయిన జలం నుండే సృష్టి మొదలయి ఉండాలి. ఇదీ ఆయన ప్రవచనం. ఈ కొత్త దృక్కోణంలో భగవంతుని ప్రస్తావన లేదు, మానవాతీత శక్తులకు స్థానం లేదు.

థేల్స్ ప్రవచనం అందరికీ ఆమోదయోగ్యం కాలేదు. అందరి వరకు ఎందుకు? ఆయన దగ్గర శిష్యరికం చేస్తూన్న అనాక్సిమేండర్ గురువుగారితో ఏకీభవించలేదు. ఇసకలో నీళ్లు లేవు. నీటి కంటె సర్వవ్యాప్తమైనది భూమి. కనుక సృష్టికి మూలం భూమి అన్నారు అనాక్సిమేండర్. నీటి కంటె, భూమి కంటె సర్వవ్యాప్తమైనది గాలి కనుక, సృష్టికి మూలం గాలి అవాలి అని అనాక్సిమేనీస్ వాదించేరు. సర్వవ్యాప్తం అయినంత మాత్రాన సరిపోదు, శక్తిమంతమై ఉండాలి కనుక సృష్టికి మూలం అగ్ని అయితే బాగుంటుందని హెరాక్లిటోస్ ముచ్చట పడ్డారు. ఇంతకీ ఈ నాలుగింటిలో దేనికి అగ్రస్థానం ఇవ్వాలి? ఈ తగువు తీర్చడానికి ఎంపిడోక్లీస్ అనే తత్త్వజ్ఞుడు మధ్యవర్తిత్వం వహించేడు. అన్ని పక్షాల వారి వాదనలని పూర్వపక్షం చేస్తూ, “సృష్టికి మూలం నీరు, నిప్పు, గాలి, మట్టి” అంటూ తుని తగవులా తీర్పు చెప్పేడీయన.



ఇలా గ్రీసు దేశంలో థేల్స్, సోక్రటీస్, అరిస్టాటుల్, ఆర్కిమిడీస్, ప్రభృతులు తరతరాలుగా ప్రజలలో పాతుకుపోయిన మూఢనమ్మకాలని, ఆచార వ్యవహారాలని ప్రశ్నించడం మొదలు పెట్టేరు.

సృష్టికి మూలం నీరు, మట్టి, గాలి, నిప్పు అనగానే సరిపోతుందా? వీటిల్లో దేనికి పెద్దరికం ఇవ్వాలన్న సమస్య ఎదురయింది. ఈ సమస్యని అరిస్టాటిల్ అనే తత్త్వవేత్త పరిష్కరించేరు. విశ్వానికి మధ్యలో భూమి ఉందన్నారు ఆయన. ఈ భూగోళం చుట్టూ ఆవరించుకుని జలగోళం ఉందన్నారు. భూమి మీద మనకి కనిపించే చెరువులు, సరస్సులు, నదులు, సముద్రాలే ఈ జలగోళం అంటే. ఈ జలగోళం చుట్టూ వాయుగోళం ఉందన్నారు. భూమిని ఆవరించుకుని ఉన్న వాతావరణమే ఈ వాయుగోళం. ఈ వాయుగోళం చుట్టూ అగ్ని గోళం ఉందన్నారు. అప్పుడప్పుడు వాయుగోళానికి చిల్లు పడితే, ఆవల ఉన్న అగ్ని గోళమే మనకి మెరుపుల రూపంలో కనిపిస్తుందని అరిస్టాటిల్ వాదించేరు. అగ్ని గోళానికి బయట ఏమి ఉంది? ఏమీలేదు. ఏమీ లేకపోవడమేమిటి? శూన్యం ఉంది కదా! ఆ ఏమీ లేని ఖాళీ ప్రదేశాన్నే – సున్నతో పరిచయం ఉన్న మనవాళ్లు - “ఆకాశం” అన్నారని నా అభిప్రాయం.

ఈ వాదనలన్నిటిని పూర్వపక్షం చేసింది ఆధునిక భౌతిక శాస్త్రం అన్న విషయం ప్రస్తుతానికి పక్కన పెడదాం. థేల్స్ సాధించినది అప్పటివరకు కరడు కట్టుకుపోయిన సహజాతీతమైన, ఆధిదైవిక శక్తుల మీద నమ్మకాన్ని తోసిపుచ్చడం! అదే ఆధునిక వైజ్ఞానిక, సాంకేతిక పరిజ్ఞానానికి ఆయువుపట్టు అయింది!

# వైవిధ్యభరితమైన నా తెలంగాణ భాష, సాహిత్య, సంస్కృతులు



ఆచార్య మత్స్యరాజ హరగోపాల్

మధురాతి మధురమైనది నా తెలంగాణ భాష , నా మాతృభాష తెలుగు. అనేక సాహితీ ప్రక్రియలకు నా తెలంగాణాయే నెలవైనది. తెలుగు భాషా సాహిత్య ప్రస్థానానికి నా తెలంగాణ మార్గదర్శనం చేసిందనుటలో సందేహంలేదు. ఏ భాషకైనా విశిష్టమైన సామాజిక ప్రయోజనముంటుంది - ఆ ప్రాంతపు జనాన్ని , వారి సామూహిక జీవితాన్ని భాష ప్రభావితం చేస్తుంది. యుగయుగాలనుండి (క్రమానుగత మైన చరిత్ర, సంస్కృతి సాంప్రదాయాలన్నీ భాషా రూపంలోనే భావితరాలవారికి అందజేయబడతాయి ! అందువల్ల బాష ఒక సాంస్కృతిక సృష్టిని చేకూర్చుకొని , విలక్షణ మైన వ్యక్తిత్వం కల్గి ఉంటుంది - విజ్ఞానార్జనలోనూ, భావ వినిమయంలోనూ ఆ ప్రాంతపు భాష, మాధ్యమంగా ప్రయోగింపబడుతుంది. నా తెలంగాణ భాషకు కూడా ఇది ప్రధాన ప్రయోజనం, 'భిన్నత్వంలో ఏకత్వం' మన భారతీయ సంస్కృతికి మూలం. భాషా విషయంలోనూ, మన దేశంలో అదే వైవిధ్యంతో దర్శనమిస్తుంది .

మానవ హృదయాలను ప్రభావితం చేయడంలోనూ, వారి-మధ్య విభేదాలు సృష్టించడంలోనూ, భాషా ప్రభావం ఎంతగా ఉంటుందో ఇటీవల కాలంలో, ముఖ్యంగా భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు తర్వాత ఇది ఎంత ప్రబలంగా ఉన్నదో, మనం




చూశాం. అయితే నా తెలంగాణ భాష ఇటీవలి కాలంలో ఎంతటి నిర్లక్ష్యానికి గురైనదో చెప్పనక్కరలేదు.

విదేశీ భాషా వ్యామోహంలో పడి, మాతృభాషను పూర్తిగా నిర్లక్ష్యం చేశాం. నేటి మన తెలుగు యువతలో మాతృభాషా పరిజ్ఞానం పూర్తిగా నశించిపోయిందనుటలో ఏ మాత్రం సందేహం లేదు. ఎందరో విద్యావేత్తలు, విద్యా కమిషన్లు కూడా బోధనా భాషగా మాతృభాష ఉండాలన్నారు. డా|| రాధాకృష్ణన్ కమిషన్ (1948), కొఠారీ కమిషన్ (1964-

66) తదితరులు తమ నివేదికలో ఈ విషయాన్ని గట్టిగా నొక్కి చెప్పారు. విషయం సూటిగా, సులభంగా అర్థం కావడానికి మాతృభాష మాధ్యమంలో బోధన జరగాలనేది నిర్వివాదాంశము. అయితే తెలంగాణా రాష్ట్ర సర్కారువారు తెలుగుభాషా బోధన మన రాష్ట్రంలో అన్ని పాఠశాలల్లోనూ జరగాలని ఆదేశించడం సంతోషకరమైన విషయం. ఇక ముందు కనీసం పాఠశాల స్థాయిలోనైనా మాతృభాషా మాధ్యమంలో బోధన జరిగితే మంచిదని నా అభిప్రాయము.

అయితే నా తెలంగాణలో తెలుగు సారస్వతము భాషా పద ప్రయోగం, రెండువేల సంవత్సరాలకు పూర్వం నుండి ఉన్నట్లు చారిత్రక ఆధారాలున్నాయి. క్రీ.శ. ఒకటో శతాబ్దానికి చెందినట్టి హాలుని గాథా సప్తశతిలో మన 'తెలుగు' భాషకు సంబంధించిన పదప్రయోగాలను సాహితీ వేత్తలు, చరిత్రకారులు గుర్తించారు. కరీంనగరం జిల్లాలోని బొమ్మలగుట్టపై 'జీవవల్లభుని' శాసనం కంద పద్యాలతో ఉన్నందువల్ల క్రీ.శ. పదవశతాబ్ధి నాటికే తెలంగాణలో ఛందోబద్ధ సాహిత్యమున్నట్లు తెలుస్తుంది. అచ్చ తెలుగులో కవితలు వ్రాసిన పాల్కురికి సోమన, నేటి జనగామ ప్రాంతంలోని 'పాలకుర్తి' నివాసి – తెలుగులో మొదటి ద్విపద కావ్యం గోనాబుద్ధారెడ్డి వ్రాసిన రంగనాథ రామాయణము, మె-



తుకుసీమికు చెందినవాడు.

తొలి అచ్చ తెలుగు కావ్యం (యయాతి చరిత్రము) రచించిన పొన్నగంటి, మొట్టమొదటి 'సకలనీతి సమ్మతం' అనబడే నీతిశాస్త్ర గ్రంథ రచయిత మడికి సింగన, అతి ప్రసిద్ధమైన ప్రథమ తెలుగు కథా సంకలన కావ్యం 'సింహాసన ద్వాత్రింశిక' రచయిత కొరవి గోపరాజు చాటుపద్యాలకు పేరొందిన కవి వేములవాడ భీమకవి, 'వాణి నా రాణి' అని గర్వంగా చెప్పిన జైమినీ భారత కర్త పిల్లలమర్రి పినవీరభద్రుడు తెలంగాణా కవులని చారిత్రిక ఆధారాలు చాటుతున్నాయి. ముఖ్యంగా, తెలుగులోని మొట్టమొదటి స్వతంత్ర రచన బసవపురాణం, మొదటి శతకం వృషాధిప శతకం. తొలి ఉదాహరణ కావ్యం 'బసవోదాహరణం' కర్త పాల్కురికి సోమనాథుడు తెలంగాణా సాహితీ చరిత్రకాద్యుడు, ఇక పోతనామాత్యుని 'మహాభాగవతం' గురించి చెప్పనక్కరలేదు.

అయితే, దురదృష్టవశాత్తు సమైక్యాంధ్ర రాష్ట్రంలో తెలంగాణ సాహిత్యం, సాహితీ మూర్తులు, వారి కృతులు మరుగున పడ్డాయి. నాటి పాలకుల పాక్షిక దృష్టి, తెలంగాణా సాహిత్యం పట్ల నిర్లక్ష్యం, ఉపేక్ష స్పష్టంగా కనిపించాయి. భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత తెలంగాణ భాష, సాహిత్యం, సంస్కృతి మరుగున పడ్డాయి. ఈ విషయంలో నేటి తెలంగాణ ప్రభుత్వం దృష్టిసారించడం, మరుగునపడ్డ త్రిలింగ దేశం (తెలంగాణ)లోని మట్టిలో మాణిక్యాలను వెలికితీసి, జన సామాన్యానికి అందజేయడం గొప్ప విషయం.

'నా తెలంగాణ కోటి రతనాల వీణ' మహాకవి డా|| దాశరథి – ఆరు దశాబ్దుల పూర్వం ఈ తెలంగాణా కవిని ముగ్ధుణ్ణిచేసి నడిపించిన తెలంగాణ, 2014కు పూర్వం తంత్రులు తెగిన వీణ... ప్రపం-

చంలో ఎక్కడా, కనీవినీ ఎరుగని రీతిలో నా తెలంగాణా జనులు తమ జీవన స్థితిని మార్చుకొనడం కొరకు, తమ భాష సాహితీ సంస్కృతులను రక్షించుకోవడానికి, వారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టుకోవడానికి పలుమార్లు మహోద్యమాలను నిర్వహించి, వేలసంఖ్యలో తమ యువత ప్రాణార్పణం తర్వాత 2 జూన్ 2014న తమ జన్మహక్కైన 'తెలంగాణ రాష్ట్రాన్ని' తెచ్చుకున్నారు. ఆనాడు నైజాం రాష్ట్రంలోనూ, తర్వాత నేటి పక్క రాష్ట్రంవారి పాలనలోనూ అన్ని రంగాల్లోనూ ముఖ్యంగా తమ భాష, సాహిత్యం, సంస్కృతీ రంగాల్లో అణిచివేయబడి, నేడు వాటి పునర్ వైభవానికి, పరిరక్షణకు తెలంగాణ ప్రజలు, తమ పాలకులను ఆర్తితో అర్థిస్తున్నారు.

ఏ ప్రాంతపు సాహితీ సంస్కృతులను, వాటి వివరాలను క్షుణ్ణంగా తెలుసుకోవాలంటే, ఆ ప్రాంతపు చరిత్ర తెలియాలి. క్రీ.పు. 300 సంవత్సరాల క్రితం మెగస్తనీస్ నేటి మెతుకుసీమలోని 'కొండాపురం'ను ప్రస్తావించాడు. నేడు ఈ ప్రాంతం త్రవ్వకాలలో దొరికిన నాణాలను బట్టి శాతవాహన రాజైన 'గౌతమీపుత్ర పులమావి' తెలంగాణ ప్రాంతాన్ని పాలించినట్లు తెలుస్తుంది. కరీంనగరం జిల్లా కోటిలింగాల ప్రాంత త్రవ్వకాలలో శాతవాహనుల కాలం నాటి ఆధారాలు దొరికాయి.

'వాత్స్యాయన కామసూత్రా'లతో శాతవాహన కాలం నాటి



కొన్ని ఆటలు నేటి తెలంగాణ ప్రాంతపు ఆటలకు పోలికలున్నాయి. ఇవి మన తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబిస్తాయి. వెన్నెలలో రాత్రిళ్ళు గడపటం, శనగ, జొన్న, కుంకులను కాల్చి తినడం, బొమ్మల పెళ్ళిళ్ళు, సుగంధ ద్రవ్యాలు కలిపిన పిండి (నేటి బుక్క, గులాలం లాంటివి) చల్లుకోవడం, చెరుకు ముక్కల దండాలు వేసుకోవడం, వాటితో ఇళ్ళను అలంకరించుకోవడం బంతులాట (కందుక క్రీడ) నేటికి కూడా మన తెలంగాణ జానపదాల్లోనూ, కన్పిస్తాయి.

తర్వాత ఇక్ష్వాకులు, విష్ణుకుండినులు, చాళుక్యులు, రాష్ట్రకూటులు ఈ ప్రాంతంలో పాలనగావించారు. నేటి 'ఎల్లోరా' లోని హైందవ శిల్పాలను రాష్ట్రకూట రాజైన కృష్ణుడు ప్రారంభించాడు. అప్పటి హైదరాబాదు రాష్ట్రంలోని 'మాల్ ఖేడ్' ప్రాంతాలను వీరు పాలించినట్లు చారిత్రిక ఆధారాలున్నాయి. తెలుగుభాషకు మొట్టమొదటగా అధికార భాషా ప్రవృత్తిని ఇచ్చి భాషాభివృద్ధికి తోడ్పడిన కీర్తి తెలుగుదేశాన్ని పాలించిన తూర్పు చాళుక్య రాజవంశం (క్రీ.శ. 625-1070) వారిది. తెలంగాణలోని 'మానుకోట' ప్రాంతంలో మొదటి చాళుక్య భీముని 'కొరవిశాసనం' (క్రీ.శ.892-921) వచన రూపంలో చక్కగా ఉంటుంది.

'తెలంగాణ' పాలకుల్లో 'కాకతీయులు' ముఖ్యులు. క్రీ.శ. 1050-1350 తెలంగాణ కేంద్రంగా వీరు తెలుగుదేశాన్ని పాలించారు. ఆనాడు శైవమే ప్రజలమతం.... 'తెనుగు' శబ్దమే 'త్రిలింగం' నుండి వచ్చినదని చెప్పడానికి శైవమే మూలాధారం.

ఆనాడు శ్రీశైలం, కాళేశ్వరం, ద్రాక్షారామం అనే శైవక్షేత్రాలతో కూడిన ప్రాంతం త్రిలింగ దేశమైంది. ఆనాటి దేశభాష 'త్రిలింగ భాష' – త్రిలింగ నుండి తెలుగు, తెలుగు, తెనుగు పుట్టుకొచ్చాయి. శైవమత ప్రాబల్యమన్నా, బౌద్ధం, జైనం, వైదికమతం కూడా ప్రచారంలో ఉన్నాయి. కాకతీయ చక్రవర్తులు నాటి తెలంగాణలో దేవాలయ శిల్పకళకు ప్రాధాన్యమిచ్చారు. దేవతారూపాలు, నర్తక, నర్తకీ బృందాలు, అలంకార శిల్పంలోని మకర తోరణాలు, హంసలు పద్మాలు, లతలు, ఏనుగులు, సింహాలు, వివిధ భంగిమల్లో హంసలు ఆలయ కుడ్యాలపై దర్శనమిస్తాయి. 'పద్మం' కాకతీయ శిల్పకళకు వన్నెతెచ్చింది. నేడు

‘రామప్ప’ దేవాలయ కాకతీయ శిల్పకళా వైభవానికి మచ్చుతునక. వీరి కాలంలోనే ‘నృత్యకళ’ కూడా వైభవాన్ని సంతరించుకుంది. ‘నృత్తరత్నావళి’ అనే నృత్యశాస్త్ర గ్రంథ రచన జరిగింది. ఇందులో తెలుగువారి పేరిగి, కోలాటమునకు సంబంధించిన విషయాలు కూడా వర్ణింపబడినాయి. తెలంగాణ కవి పాల్కురికి సోమనాథుడు కూడా వివిధ నృత్య భేదాలను తమ రచనలో పేర్కొన్నారు. ఇవి తెలంగాణ సంస్కృతికి దర్పణాలు.

ఇక కాకతీయ చక్రవర్తులు తెలంగాణ భాషాభివృద్ధికి ఎంతగానో కృషి చేశారు. తెలుగుభాషా వికాసం, సాహిత్యం, కళలు వీరి కాలంలో మహోన్నత దశకు చేరుకున్నాయి. కవిత్రయంలోని తిక్కన నిర్వచనోత్తర రామాయణాన్ని, విశ్వనాథ కవి’ ‘ప్రతాపరుద్ర యశోభూషణం’ అలంకార శాస్త్రాన్ని కాకతీయుల కాలంలోనే రచించారు.

కాకతీయుల పాలనలో దేశికవిత ‘జాను తెనుగు’ పుంతలు తొక్కింది. ‘ద్విపద’ రచనల్లో ప్రసిద్ధమైన ‘రంగనాథ రామాయణం’ (రచన – బుద్ధరాజకవి) రచించగా, కేతన ‘ఆంధ్రభాషా భూషణం’ అనబడే లక్షణ గ్రంథం రచించారు. భారత, రామాయణ ఇతివృత్తంగా ఎన్నో రచనలు వచ్చాయి. తెలుగుభాష, సాహిత్య సంస్కృతుల పరిరక్షణకై, హైందవ సంస్కృతీ రక్షణకై

పాల్కురికి సోమనాథకవి (1160-1240)



తత్త్వ విద్యాకలాప కవితాసార, అన్యవాద కోలాహల, ప్రత్యక్ష భృంగీశావతార, జైన మస్త కవిన్యస్తశాతశూల, కలిత బిజ్జలతలగుండుగండ, సంగీతశాస్త్రపారగ, చతుర్వేద పారంగతాది బిరుదవిభ్రాజితుడగు “మహితాత్ముడు”.

కాకతీయులు కంకణం కట్టుకున్నారు. ‘తెలంగాణ’ ఇదొక స్వర్ణయుగం. ‘ఓరుగల్లు’ వారి మహోన్నతమైన ఆదర్శాలకు నేటికి కూడా దర్పణంగా నిలిచింది. నేటి ‘తెలంగాణ’ ప్రభుత్వ చిహ్నంతో ఓరుగల్లు తోరణం ఉండడమే అందుకు నిదర్శనం.

తర్వాతి కాలంలో ‘భక్తి ఉద్యమ’ ప్రభావం తెలుగు గడ్డపై స్పష్టంగా కన్పించింది. బమ్మెర పోతనామాత్యుని ‘మహాభాగవతం’ మహాత్కృష్ట గ్రంథం భక్తికి పరాకాష్ఠ. తెలంగాణలోని మారుమూల ప్రాంతాల్లోనూ, జానపదుల్లో ‘పోతన’ పద్యాలు నేటికి కూడా చెరగని ముద్రవేశాయి, వేస్తున్నాయి. ఒక్కో పద్యం ‘పోతన’ హృదయాంతరాళాల నుంచి ఉద్భవించిన భక్తిరస తత్త్వానికి నిదర్శనం. ఒక్కటేమిటి ఆది నుండి అంతంవరకు ఈ మహాపురాణం మనపై తన ప్రభావాన్ని చూపుతుంది. ‘గజేంద్రమోక్షం – రుక్మిణీ కల్యాణం’ లాంటి ఘట్టాలైతే తెలుగు ప్రాంగణాల్లో నేటికి మార్మోగుతూ, మన హృదయాలను పవిత్రం చేస్తున్నాయి. ఈ భక్తి ఉద్యమ ప్రభావంతో తెలుగుభాషలో ‘దేశీకవిత’ ప్రచారంలోకి వచ్చింది.

మన తెలంగాణ భాషలో ద్విపద, మంజరి, చందమామ పాటలు, తుమ్మెద పదాలు, ఉయ్యాల పాటలు, జోలపాటల జోజోలు, తందనాలు మొదలైనవి ‘దేశీకవిత’ వన్నె తెచ్చాయి. ఇవి భక్తి తత్త్వానికి, సంగీతానికి గల దగ్గరి సంబంధాన్ని నిరూపిస్తూ తమదైన రీతిలో జనాల్ని ప్రభావితం చేశాయి. నేటికి చేస్తున్నాయి కూడా. వీటిలోపాటు మన తెలుగు ఆడపడుచులు పాడే మంగళహారతులు, కీర్తనలు తెలుగునాట ‘భక్తి తత్త్వాన్ని’ – సాహిత్యాన్ని పటిష్ఠంచేసి జన సముదాయంలో చొచ్చుకుపోయాయి.

తర్వాత విజయనగర చక్రవర్తుల పాలనలో తెలుగు భాషా పోషణ జరిగింది. ముఖ్యంగా ‘శ్రీ కృష్ణదేవరాయలు’ తన అష్టదిగ్గజాలతో సాహితీసేవ చేసి ‘సాహితీసమరాంగమణ సార్వభౌముడు’గా తెలుగువాఙ్మయ చరిత్రలో ధృ-

వతారగా నిలిచాడు. అయితే ఈ కాలంలో తెలంగాణ ప్రాంతం బహుమనీ సుల్తానులు, కుతుబ్ షాహీ నవాబుల పాలనలోకి వెళ్ళింది. అయితే కుతుబ్ షాహీ నవాబులు తెలుగు కవులను పోషించారని, రాజకీయ వ్యవహారాలను తెలుగుభాషలో కొనసాగించినట్లు తెలుస్తుంది. 'తానీషా' కాలంలో 'కంచర్ల గోపన్న' భద్రాచలం తహసీల్దార్ గా ఉండి భద్రాద్రి రాముడి ఆలయ నిర్మాణం గావించాడు. సీతారాముల వారికి ఆభరణాలు తయారుచేయించాడు. అయితే ఆయన పదునాలుగేళ్ళపాటు జైలు జీవితం గడిపి, శ్రీ సీతారాములు 14 ఏళ్ళ వనవాసాన్ని మనకు గుర్తుకు తెచ్చాడు. నేటికి కూడా శ్రీరామ నవమీ సందర్భంగా, తెలంగాణా ప్రభుత్వం స్వామివారికి, సీతమ్మవారికి భక్తిప్రపత్తులతో వస్త్రాభరణాలను సమర్పించడం మన తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచింది.

తదనంతరం ఆసఫ్ జాహీ వంశస్థులైన 'నిజాం సర్కారు తెలంగాణ' పాలకులైనారు. నైజాం రాష్ట్రంలో తెలుగు, మరాఠీ, కన్నడ ప్రజలున్నారు. అయితే ప్రజలపై 'ఉర్దూ' భాషను రుద్దింది. ప్రజలు తమ 'మాతృభాష'లో బోధన జరగాలని కోరినా, విశ్వవిద్యాలయ స్థాయి వరకు కూడా 'ఉర్దూ' బోధనా భాషగా ఉండింది. ఒక మాటలో చెప్పాలంటే 'తెలుగు' తన 'వెలుగు'ను పూర్తిగా కోల్పోయిందీ




కాలంలో – ఇందుకు నిరసనగా 'ఆంధ్రజనసంఘం' ఏర్పడింది. ఆనాడు తెలుగువారికి ప్రాతినిధ్యం వహించే సంస్థ ఇదొక్కటే సమావేశాలు ఏర్పాటుచేసి నైజాం రాష్ట్రంలో 'తెలుగు' భాషాభివృద్ధికి తీసుకోవలసిన చర్యలపై చర్చించేవారు. 1930-1946 మధ్యకాలంలో వివిధ ప్రాంతాల్లో ఆంధ్రమహాసభలు నిర్వహించారు. ఆనాటి తెలంగాణలోని తెలుగు భాషాభిమానాలు, నాయకులైన శ్రీ సురవరం ప్రతాపరెడ్డి బూర్గులరామకృష్ణారావు, మాడపాటి హనుమంతరావు కొండా వెంకటరంగారెడ్డి, రావి నారాయణరెడ్డి, మందుముల నరసింగారావు, జమలాపురం కేశవరావు మొదలైన వారెందరో నాయకత్వం వహించారు. మహిళామహాసభలు కూడా జరిగాయి. భాషోద్యమంగా, సాంస్కృతిక ఉద్యమంగా ప్రారంభమై అనతికాలంలో విప్లవోద్యమంగా మారింది.

ఇందుకు తోడుగా 1901లో భాగ్యనగరంలో 'శ్రీ కృష్ణదేవరాయ ఆంధ్రభాషా నిలయం' శ్రీ కొమర్రాజు వెంకటలక్ష్మణరావు, రావిచెట్టు రంగారావు, రాజా నాయిని వెంకటరంగారావు సారధ్యంలో స్థాపించబడింది. 1941లో వట్టికోట ఆళ్వారుస్వామి 'దేశోద్ధారక గ్రంథము' స్థాపించారు. 1919లో తెలంగాణలోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో క్రీ.శ. 1940 నాటికి (అంటే 30 సంవత్సరాల తర్వాత తెలుగులో ఎం.ఏ.మాస్టర్స్ డిగ్రీ ప్రారంభించారు. 1952-53లో పి హెచ్.డి. తెలుగులో పరిశోధనా సౌకర్యాలు కల్పించబడ్డాయి. అప్పుడే 1952లో 'తెలంగాణ రచయితల సంఘం' ఏర్పాటైంది. అనేక సంవత్సరాలుగా నొక్కి పెట్టబడిన గొంతులు విచ్చుకున్నాయి. వీటికి ఆద్యులు శ్రీ దాశరథి, లక్ష్మీరంజనం, సి.నారాయణరెడ్డి, కాళోజీ నారాయణరావు, వానమామలై వరదాచార్యులు, బిరుదురాజు రామరాజు, పల్లా దుర్గయ్య, కప్పగంతుల లక్ష్మణశాస్త్రి ఇరివెంటి కృష్ణమూర్తి, పి.వి.రాఘవాచార్యులు తదిత-

రులు.

ఇదిలా ఉండగా 'నైజాం రాష్ట్రం' భారత ప్రభుత్వ పోలీసు చర్య ఫలితంగా, సర్దార్ వల్లభ భాయి పటేల్ నాయకత్వంలో 17 సెప్టెంబర్ 1948న భారతదేశంలో సంపూర్ణంగా విలీనమైంది. తర్వాత భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుతో 1 నవంబరం 1956న తెలంగాణ జిల్లాలో తెలుగు ప్రజలు 'ఆంధ్రప్రదేశ్' రాష్ట్ర ప్రజలైనారు. కాని తెలంగాణ ప్రాంతం, భాష, సాహిత్యం, సంస్కృతుల ప్రాభవాన్ని తగ్గించడానికి పాలకుల ప్రయత్నం స్పష్టంగా కన్పించింది. కలిసిమెలసి ఉండవలసిన తెలుగు ప్రజలు విడిపోవడమే మంచిదనే అభిప్రాయానికొచ్చారు. 1968 ఉత్తరార్థం, క్రీ.శ. 1969 పూర్వార్ధంలో ప్రత్యేక తెలంగాణ ఉద్యమం తీవ్ర రూపం దాల్చింది. ఆనాడు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థిని నేను... విశ్వవిద్యాలయమంతా అట్టుడికి పోయింది. కాని ఆనాటి కొందరు రాజకీయ నాయకుల స్వార్థంవల్ల, 'తెలంగాణ' రాష్ట్రం ఏర్పాటు ఆగిపోయింది. విద్యార్థులు, యువతరం బలిదానాలు' వ్యర్థమయ్యాయి. 45 సంవత్సరాల తర్వాత మరో మహా ఉద్యమం రావడం, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం జరగడం, అతిక్లిష్ట పరిస్థితుల్లో యాదృచ్ఛికంగా జరిగి పోవడం ప్రపంచ చరిత్రలోనే మరుపురాని, మధురమైన అపురూప ఘట్టం... ఎందరో




విద్యార్థులు, యువతీయువకులు.. త్యాగధనుల బలిదానాల ఫలితంగా ఏర్పడ్డ నా తెలంగాణ రాష్ట్రంలో నా భాష, సాహిత్యం, సంస్కృతీ వికాసాలను కోరుకోవడంలో, అందుకు నేటి పాలకుల సహకారాన్ని ఆశించడంతో తప్పేమి లేదు కదా!

'దేశభాషలందు తెలుగు లెస్స' – ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్... అంటూ తెలుగుభాషా ప్రాముఖ్యాన్ని చాటడం మంచిదే. అయితే ఒకమాట- సాహిత్య సంగీతాలకు ఎల్లలంటూ ఉండవు. వాటిని వ్యాప్తిచేయాలేగాని నిరోధించరాదు. ఆనాడే భాషా, సాహిత్య, సంస్కృతుల ప్రాభవం పెరుగుతుంది.

'సహితయో భావ సాహిత్యమ్' అన్నట్లుగా ఏ భాషా సాహిత్యంలోనైనా శ్రేయోభావముండాలి. జాతిని మహోన్నత స్థానానికి తీసుకువెళ్ళగలిగిన సత్తా ఉండాలి. మనిషిలోని దౌర్బల్యాలను రెచ్చగొట్టేవిగా ఉండకూడదు, ప్రపంచంలోని మానవాళి యొక్క సర్వాంగీణ శ్రేయస్సే సాహిత్యం యొక్క ముఖ్యోద్దేశమై ఉండాలి. అయితే ఏ సాహిత్యంలోనైనా శాశ్వత విలువలుండాలి. ఈ విలువలే ఆయా దేశాల, జాతి యొక్క సంస్కృతీ వైభవాలకు ప్రతీకలుగా నిలుస్తాయి. వేదకాలం నుండి, ఆధునిక యుగం వరకు ఈ విషయం వర్తిస్తుంది. 'సంఘర్షణ' అనేది జాతి జీవనంలో ఒక భాగం. సంఘర్షణ లేని జాతికి మనుగడయే లేనప్పుడు, ఔన్నత్యమనేది ఉండదు, సాహిత్యమనేది ఆనాటి సాంఘిక జీవన విధానానికి, ఆచార వ్యవహారాలకు గుర్తుగా నిలుస్తుంది. అయితే ఒక మాట, సాహిత్యంలోని శాశ్వత విలువల్ని, కేవలం సంఘంలోకి చొచ్చుకుపోయి, వారితో సహజీవనం చేసిన వ్యక్తులే తెలియచేయగలరేకాని, కేవలం ఉబుసుపోక రచయితలు కారు.

అలనాడు కందమూల ఫలాదులను భుజించి, నిష్కామ కర్ములైన మహర్షుల రచనలు నేటికీ శాశ్వతంగా నిలిచిపోవడానికి కారణమిదే. అలనాడు వాల్మికి, వేదవ్యాసులవారి రామాయణ, మహాభారతాలు, మధ్యకాలంలో బమ్మెరపోతనగారి తెలుగుమహాభాగవతం, ఇటీవలి దాశరథి రంగాచార్య, కాళోజీ సి.నారాయణరెడ్డి వారి రచనలు, ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు, సమాజ శ్రేయస్సే వారి రచనల్లో ప్రస్ఫుటంగా కన్పిస్తుంది. శాశ్వత విలువలను సంఘంలో ప్రచారం చేసే ముందు వాటిని ఆచరించారు. ఇద రచయితలకు, సాహిత్యకారులకు ప్రాథమిక అర్హత, పోతన భాగవతంలో "కారే రాజులు రాజ్యములంగలగవే, గర్వోన్నతిన పొందిరే వారేరి? సిరిమూటగట్టుకొని పోవరండాలిరే? భూమిపై పేరైననం గలదే? శిబి ప్రముఖులనం బ్రీతిన్ యశః కాములే..... వారలనం మరచిర యికో్కలమునం భార్గవా!" అంటూ రాజులంతా ఎక్కడున్నారయ్యా! ఈ భూతలాన్ని పాలించిన భూపతులంతా ఎక్కడున్నారు? శిబి, రంతిదేవునిలాంటి దానశీలురను మాత్రమే మనం కొనియాడుతూ, గుర్తించుకున్నాము... అంటూ పచ్చి నిజాన్ని తెలిపాడు పోతన, మన జాబిత దానగుణమనే సంస్కృతికి ప్రతీక, భూమి దున్నుకొనైనా బతకడం మేలు, కాని ధనమదాంధులైన కిరాత కీ-




చకులకు 'సరస్వతీదేవిని' అమ్మనన్నాడాయిన, తద్వారా ధనంతో కళ్ళుకప్పుకుపోయిన చక్రవర్తులకు పండితుల, సాహిత్యకారులు తలవంచకూడదని, ఊడిగం చేయరాదన్న శాశ్వత సత్యాన్ని, విలువలను ప్రబోధించాడు పోతనామాత్యుడు. తమ సాటివారు, ఆయా కాలాల్లో విమర్శించడం జగమెరిగిన సత్యమంటూ, ఇతరులు మనను విమర్శించినా, మనము నిర్భయంగా కార్యసాధన చేయాలంటారు. కార్యసాధకులైన సాహితీవేత్తలు.. ఇటీవలి కాలంలో దాశరథి రంగార్యులవారి రచనల్లో నాటి సమాజంలో (తెలంగాణ సమాజంలో) జరిగే దౌర్జన్యాలు, వర్గ సంఘర్షణల యొక్క చిత్రీకరణ స్పష్టంగా కన్పిస్తుంది. ధనమదాందులు సమాజంలోని బడుగువర్గాలను హింసించడం, అణగద్రొక్కడం అనేది చారిత్రక సత్యమంటూ, ఇవి ఇక అంతం కావాలని ప్రబోధిస్తాడు దాశరథి. ఇవి శాశ్వత విలువలకు తెలంగాణ సాహిత్యంలో కొన్ని మచ్చుతునకలు.

అయితే నేటి మన తెలంగాణంలో పఠనాశక్తి దిగజారుతుందేమోననిపిస్తుంది. కాలక్షేప రచనలు తప్ప శాశ్వత విలువల్ని ప్రబోధించే గ్రంథాలను చదివే ఓపిక, తీరిక మనకు లేదేమోనన్పిస్తుంది. ఇందుకు కారణాలను మేధావివర్గం విశ్లేషించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మేధావి వర్గం రచనా వ్యాసంగాన్ని చేపట్టకపోవడమే సాహిత్య పతనానికి కారణమంటారు. గోరాశాస్త్రి ఇక నేటి సమాజంలో ధనమదాంధులకిచ్చే గౌరవం, సాహితీవేత్తలకు లభించడం లేదనేది స్పష్టంగా కన్పిస్తుంది. ఈ దృక్పథం మారితే సాహితీ విలువలు పెరుగుతాయి. ఇటీవల కాలంలో తెలంగాణ ప్రభుత్వం దృష్టిసారించడం ముదావహం. తెలంగాణలోని ప్రాచీన, ఆధునిక సాహిత్యాన్ని సాహితీకారులను వెలుగులోకి తీసుకోవచ్చి వారికి సముచిత స్థానం, గౌరవం కల్పించడం ఒక ఎత్తైతే, తెలంగాణ భాష,

సాహిత్యం, కళలు, సంస్కృతీ వైభవాన్ని గుర్తుకు తెస్తూ కార్యక్రమాలు నిర్వహించడం జాతిని ఉత్తేజింప చేస్తున్నాయి.

తెలంగాణ ప్రాంతపు ఆలయాల అభివృద్ధికి, (యాదాద్రి, భద్రాద్రి, వేములవాడ తదితరాలు....) బోనాలు, సమ్మక్క సారక్క జాతరలు, ముఖ్యంగా 'బతుకమ్మ' ఉత్సవాల నిర్వహణ, కళాకారుల సంక్షేమం లాంటివి ఈనాటి ప్రభుత చేపట్టి, ఘనంగా నిర్వహించడం, సంతోషకరమైన విషయం. ఇవి తెలంగాణ సమాజంలోని అలనాటి మన వైభవాన్ని మనకు గుర్తుకు తెస్తూ మన ఆత్మస్థైర్యాన్ని, గౌరవాన్ని పెంపొందిస్తాయనుటలో ఏ మాత్రం సందేహం లేదు.

'లోకాస్సమస్తా స్సుఖినో భవంతు' అన్నట్లుగా సర్వమానవాళి శ్రేయస్సు తెలంగాణ సాహితీకారుల లక్ష్యంగా ఉండాలి. నేటి తెలంగాణ విద్యాలయాల్లో తెలుగుభాషను తప్పనిసరిగా బోధించడమే కాకుండా, గ్రంథాలయాలుండాలి. ఇందులో ప్రాథమిక స్థాయి నుండి కళాశాల స్థాయివరకు తెలంగాణ చరిత్ర, భాష, సాహిత్య, సాంస్కృతిక వైభవాలను తెలియజేసే పుస్తకాలుండాలి. అలనాడు గ్రంథాలయ ఉద్యమం ద్వారా భాషా వికాసం జరిగింది. నేడు దాన్ని ముందుకు తీసుకెళ్ళవలసిన అవసరం ఎంతైనా ఉంది.అందుకుగాను విద్యార్థి దశ నుండే యువతరాన్ని ఇటువైపు



ప్రోత్సహించి కార్యాలయాల్లోనూ తెలుగుభాషా ఫలకాలు, పాలనాపరమైన ఆదేశాలు, తెలుగుభాషలోనే జరగాలి. తెలుగుభాషా మాధ్యమంలో విద్యనభ్యసించిన యువతకు ప్రోత్సహకాలు, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించాలి. అయితే నాదొక సూచన... భారతీయ భాషలకు తల్లి భాషయైన 'సంస్కృతం' కూడా విద్యావిధానంలో ఉండాలి. తద్వారా భారతీయ విలువలు, సంస్కృతీ సాంప్రదాయాలను 'తెలుగు' భాషతో మేళవిస్తే పూలకు పరిమళాన్నిచ్చినట్లు బంగారానికి వన్నె తెచ్చినట్లుంటుంది.... తెలంగాణ సామాన్య జనానికి, జానపదులకు ఉపయోగపడే శతకాలు, పద్యాలు, వచనాలు సులభమైన భాషలో రాయించాలి. అంటే సామాన్యులకు అందుబాటులో ఉండే రీతిలో 'తెలుగు'లో పుస్తకాలు రావాలి. హింస, ద్వేషం లాంటి దుర్గుణాలను పక్కనపెట్టి సౌహార్ధత, సౌభ్రాతృత్వం, ప్రేమ, జాతీయత, దేశ, ప్రాంత సంస్కృతీ వైభవాల ప్రాతిపదికగా మాతృభాష తెలుగులో రచనలు రావడం, అందుకు తగిన ప్రోత్సాహం, వాతావరణం కల్పించడం నేడు మనందరి భాధ్యత.

'రచయిత' సమాజంలో ఒక వ్యక్తి తమ కలం ద్వారా, సమాజాన్ని చైతన్యవంతం చేసే గురుతర బాధ్యత సాహితీకారులపై ఉంది. ఇందుకు పత్రికలు, ప్రసారమాధ్యమాలు కూడా తమ సహకారాన్ని అందించాలి. ఆనాడే గాంధీజీ కలలుగన్నట్లు సమాజం జాగృతమవుతుంది. చైతన్యవంతమవుతుంది. తద్వారా సమాజంలోని యువతరం నిరాశ నిస్పృహల నుండి విముక్తి పొంది, నవ నవోత్సహంతో ముందుకు సాగుతారు. భావిభారత పౌరులంతా దేశ ప్రగతికి, రాష్ట్ర ప్రగతికి పాటుపడతారు. ఆ శక్తి కేవలం కలానికి మాత్రమే ఉంది. సమాజ శ్రేయస్సుకు తెలంగాణ సాహితీవేత్తలు, మేధావి వర్గం భాగస్వాములు కావాలి. అందుకు పాలకులు కూడా వారిని వెన్నుతట్టి తగిన ప్రోత్సాహమివ్వాలి. ఆనాడే మనం కలలుగన్న 'బంగారు తెలంగాణ'ను మనం చూడగల్గుతాము.

"ఆనోభద్రాః ఋతవో యంతు విశ్వతః" (ఋగ్వేదము 1-89-1) అన్నట్లుగా అన్నివైపుల నుండి మనలో మహోన్నతమైన ఆలోచనా విధానం పటిమ, భావనలు ప్రసారమవుగాక...

ఆచార్య మత్స్యరాజ హరగోపాల్
(Prof. Mathsyaraja Haragopal)

# పూరి జగన్నాధ స్వామి వైభవం

**డా.పోచనపెద్ది వెంకట మురళీ కృష్ణ**



పూరి జగన్నాధుని రధయాత్ర తెలుగువారికి అత్యంత ప్రీతి పాత్రమైె నది.కాని ఆ స్వామికి సంబంధించిన పురాణగాథ సంపూర్ణంగా కొద్దిమందికి మాత్రమే తెలుసు.

స్కాందపురాణాంతర్గతమైన జగన్నాధ క్షేత్ర మాహాత్త్యాన్ని యధామూ లంగా, సరళ, వ్యావహారిక భాషలో అనువదించి మన పాఠకులకు ప్రతి నెల అందిస్తున్నాము. చదవండి, చదివించి మోక్షాన్ని పొందండి.

\- సంపాదకురాలు

## 38 వ అధ్యాయం

### ( ప్రసాద వైభవం)

ఈ విధంగా వరాలను ఇచ్చి స్వామి అంతర్ధాన మయ్యాడు.స్వామి ప్రసాదం స్వయంగా అమ్మయే చేస్తుంది.ఆ ప్రసాదాని స్వీకరించిన వారి పాపాలన్ని నశిస్తాయి. స్వామి ప్రసాదంతో సమానమైనది మరొకటి లేదు.స్వామి ప్రసాదం చూసినా,తాకినా తప్పు కాదు. ఈ ప్రసాదాన్ని ఎవరు తీసుకున్నా పవిత్రులవుతారు. రోగాలన్నిపోతాయి.పుత్ర,పౌత్ర వృద్ధి కలుగుతుంది. పేదరికం పోతుంది.విద్య,ఆయువు,సంపదలు,శుభాలు కలుగుతాయి.స్వామి ప్రసాదం తీసుకున్న వారిపై విష్ణువునకు ఎక్కువ ప్రేమ ఉంటుంది. ( 1 - 12 )

స్వామి ప్రసాదాన్ని నిందించిన వారు మూర్ఖులు యముడు స్వయంగా వచ్చి శిక్షిస్తాడు. కుంభీ పాకం అను నరకంలో పడతారు.స్వామి ప్రసాదాన్ని అమ్ముట కాని,కొనుటకాని మంచిది కాదు.స్వామి ప్రసాదాన్ని తీసుకొన్న తరువాతే, మిగిలినవి తినాలి.ప్రసాదం లభించినప్పుడు ఎలాంతిపరిస్థితిలోఉన్నాస్వీకరించాలి. కొన్నియుగాలనుండి,స్వామిప్రసాదాన్నిస్వీకరిస్తున్నారు.(20)



కలియుగంలో ఆ నారాయణుడు దారు రూపంలో నీలాద్రిపై అవతరించాడు. లక్ష్మీదేవి అక్కడ ప్రవృత్తి రూపం లోఉంది. నారాయణునికి ప్రసాదం చేసి పెడుతుంది. ఆ ప్రసాదాన్నిజగన్నాథుడు స్వీకరిస్తూ ఉంటాడు.కలియుగంలో ఈ ప్రసాదాన్ని స్వీకరించిన వారికి అధికమైన పుణ్యం లభిస్తుంది. ( 34 )

కలియుగంలో రాజులు ప్రజలను పన్నులు వేస్తూ బాధిస్తూ ఉంటారు.రాజులు హంతకులుగా మారుతారు. వర్ణ వ్యవస్థ నశించి పోతుంది. బ్రాహ్మణులు స్మార్త కర్మలను విడిచి పెడతారు. దానము ధర్మం గా భావిస్తారు. బ్రాహ్మణులకు దానం చేస్తే భగవంతుడు ఆనందిస్తాడు. కనుక కలియుగంలో బ్రాహ్మణులకి దానం చేయాలి.( 40 బ్రాహ్మణులను రక్షించడానికి పరమాత్మ ఎప్పుడు అవతరిస్తూఉంటాడు.బ్రహ్మ సృష్టిచేయుటకు ముందుగా బ్రాహ్మణులను సృష్టించాడు.అందువలన బ్రాహ్మణులు విష్ణువుతో సమానం.కలియుగానికి విష్ణువే నాథుడు. విష్ణువు నీలాద్రిపై దారు రూపంలో అవతరించారు.ఆ స్వామిని దర్శించుకున్న,స్తుతించిన ప్రసాదాన్ని స్వీకరించినా మోక్షం లభిస్తుంది. (47)

స్వామికి,ఇతర మూర్తులకు, నివేదించిన ప్రసా దాన్ని మూర్తులను చూస్తూ స్వీకరించాలి. “ స్వామి! నీ ప్రసాదాన్ని మేము స్వీకరిస్తున్నాం. నిన్ను చూస్తూ ప్రసాదాన్ని స్వీకరించిన వారికి ఎట్టి కష్టాలు లేకుండా మోక్షాన్ని ప్రసాదించు. స్వామి,ఇతరమూర్తులు, వేదాన్ని రక్షించడానికే ఇక్కడ అవతరించారు.స్వామి ఎప్పుడూ వేద ధర్మాన్ని అతిక్రమించడు.( 53 )

పూర్వం ఒక బ్రాహ్మణుడు ఇక్కడికి వచ్చి స్వామిని దర్శించుకున్నాడు. అతడు నిష్ఠాగరిష్టుడు. మూడురోజులు స్వామిని అర్చించాడు.ఇంటిలో వండిన ఆహారాన్ని మాత్రమే తింటూ ఉండేవాడు. స్వామి ప్రసాదం ఇతరులు తయారు చేస్తారని భావించి, తీసుకునేవాడుకాదు.స్వామి ప్రసాదాన్ని తిరస్కరించిన పాపం వలన ఆ బ్రాహ్మణుడికి వ్యాధులు సంక్రమించాయి.మూగవాడు అయ్యాడు. కుటుంబంలో అందరు వ్యాదిగ్రస్తులయ్యారు. తాను ఈ క్షేత్రంలో చేసిన తప్పు ఏమో తెలియక ఆ బ్రాహ్మణుడు భగవంతుని ప్రార్ధించాడు.

“ఓ!దేవా!ధర్మం నిర్ణయించడానికి ఆధారమైన పదునాల్గువిద్యలు నీముఖంనుండి వెలువడ్డాయి. వాటిని ఆచరిస్తే ధర్మం ప్రతిష్ఠించబడుతుంది.ధర్మాన్ని రక్షించడానికి నీవు ప్రతి యుగంలోను అవతరిస్తూ ఉంటావు. ధర్మాన్ని అతిక్రమిస్తే నీకు ద్రోహం చేసినట్లే అవుతుంది.

దేవా!నేను నీ భక్తుడను. అర్ధ కామాలు తీర్చుకోవడానికి నేను ఎప్పుడు ధర్మాన్ని అతిక్రమించలేదు. అనేక జన్మలలో చేసిన పాపాన్ని పోగొట్టుకోవడానికి ఇక్కడికి వచ్చాను. (54- 68)

నీ దర్శనంతో ఆ పాపాలన్నిటిని నశింపచేయి. నీవు చెప్పిన శాస్త్రాలన్నిటిని ఆచరించాను. ఇందులో నా అపరాధం ఏమిటి?. ఈవ్యాధి నా శరీరాన్ని బాధిస్తోంది.తెలిసిగాని,తెలియకగాని, చేసిన అపరాధాలనుక్షమించు. నా పాపాలను పోగొట్టు.శోక సముద్రంలో మునిగి ఉన్నాను. నన్ను కాపాడు. నిన్ను దర్శించుకొన్న వాడికి దుఃఖం ఎక్కడ ఉంటుంది?.ఆనందంగా ఉన్నవాడు దుఃఖించడుదా!.పుణ్యం చేస్తేకాని నీ దర్శనం లభించదుకదా!.నేను చేసిన అపరాధంవలన మోక్షం రాదు.నీ దాసుడనయిన నా అపరాధాలను క్షమించు. “ అని బ్రాహ్మణుడు ప్రార్థించాడు.(69-77)

అతనిబాధలన్నితొలగిపోయాయి.లక్ష్మీదేవిపాయసంఇస్తూండగానరసింహస్వామి,సింహాసనంపైకూర్చుని ఉన్నట్లుగా అతనికి కల వచ్చింది.శాండిల్యుడికి తాను చేసిన తప్పుఏమిటో తెలిసింది.”దేవా! అజ్ఞాని అగు నేను ఎక్కడ?సర్వజ్ఞుడవగు నీవెక్కడ? పంచభూతాలు నీవే సృష్టించావు.మాయచేకప్పివేయబడిన నా మనస్సు నిన్నుతెలుసుకోలేదు.నీలీలలు వర్ణింపలేము.”అని బ్రాహ్మణుడు స్తుతించాడు.

స్వామి తనచేతిలోని పాయసాన్ని బ్రాహ్మణుడి పైకి విసిరాడు. శాండిల్యునికి దివ్యశరీరం లభించిది. జీవన్ముక్తుడయ్యాడు. బ్రాహ్మణుడు తన శరీరంపై పడిన ప్రసాదాన్ని స్వీకరించాడు.మిగిలిన ప్రసాదాన్నికుటుంబ సభ్యులకోసం తీసుకొని బయలుదేరాడు. ఇంతలో మేలుకొన్నాడు. ఇదంతా కల అని తెలుసుకొని ఆశ్చర్య పోయాడు. స్వామి ప్రసాదాన్ని స్వీకరించక పోవడమే తానుచేసిన తప్పు అని గ్రహించాడు. (78-91)

మానవులు చేసిన ప్రసాదాన్ని ఈ క్షేత్రంలో స్వామి స్వయంగా స్వీకరిస్తాడు.పదునాల్గులోకాలు ఆశ్రయించే పాదాలను ఇక్కడ ధర్మం అను నీటితో కడిగిమోక్షాన్నిపొందవచ్చు”అని శాండిల్యుడుభావిస్తూ స్వామి ప్రసాదాన్ని తీసుకొని కుటుంబ సభ్యులకి పెట్టాడు. వారందరు తిరిగి ఆరోగ్యాన్నిపొందారు.వారందరు పునర్జన్మ పొందినట్లుగా భావించారు. (92-95)

సప్తద్వీపాలలోను పురుషోత్తమక్షేత్రంతో సమానమయిన క్షేత్రం మరొకటిలేదు.ఇక్కడ స్వామి స్వయంగా ప్రసాదాన్ని ఇచ్చి,ముక్తిని ఇస్తాడు.స్వర్గం,భోగం,ముక్తి,ఇక్కడ లభిస్తుంది.సంసారంఅనేఅరణ్యాన్ని దాటుకొనిభక్తులుఇక్కడికి వస్తారు.మోక్షాన్ని,భోగాలను అనుభవిస్తారు”అని ఒకరితో,ఒకరు చెప్పుకుంటూ భోజనం పూర్తిచేసారు.వారిలోని పాపం తొలగిపోయి బాల సూర్యుడిలాగ ప్రకాశిస్తున్నారు.

ఇక్కడ ఉన్న జనార్దునికి సమర్పించిన పూలు,చందనం,మాలలు మొదలయిన నిర్మాల్యాలను శరీరంపై ధరించినట్లయినపాపాలన్ని నశిస్తాయి.శ్రీఖండం,అగరు, కర్పూరం,కస్తూరి,కుంకుమ మొదలయిన సుగంధ ద్రవ్యాలు మెత్తగా నూరి స్వామి విగ్రహానికి పూయాలి.

ఈవిధంగా సంవత్సరం అంతా పూయాలి.సంవత్సరం చివర తీసివేయాలి.ఆసమయంలో ఎవరు స్వామిని చూడకూడదు.తిరిగి లేపనం పూయడం ప్రారంభించాక



స్వామిని దర్శించుకోవచ్చు.స్వామివలె ఇతరులు ఆ లేపనాని రాసుకోకూడదు.

పూర్వం ఒక రాజకుమారుడు స్వామికి వినియోగించే గంధాన్ని ఒక సేవకుడిద్వారా సంపాదించి,తాను రాసుకోవడం ప్రారంభించాడు.అతనికి కుష్ఠువ్యాధి వ్యాపించింది.స్వామి గంధాన్ని దొంగతనంగా రాజకుమారుడికి ఇచ్చిన ఆ సేవకుడికికూడా కుష్ఠువ్యాధి వచ్చింది.స్వామి నిర్మాల్యమైన గంధం పవిత్రమైనది.

పూర్వం దమనకుడు అను రాక్షసుడు సముద్రం ప్రయాణం చేస్తున్నవారిని బాధిస్తూ ఉండేవాడు. నారాయణుడు మత్స్యావతారంలో ఆ రాక్షసుని ఒడ్డుకు తీసుకువచ్చి పిండి పిండి చేసాడు.భగవంతుని చేయి తగలడం వలన అక్కడి గడ్డికి సువాసన వచ్చింది.ఆగడ్డినినారాయణునిపేరుతోనేపిలుస్తున్నారు ఆగడ్డితో చేసిన మాలను స్వామి ధరిస్తాడు.ఆ సువాసన ఇతర పుష్పాలకు వ్యాపించింది.స్వామి విగ్రహంనుండి తీసిన మాలను తలపై పెట్టుకుంటే వేయి అశ్వమేధ యాగాలు చేసిన ఫలితం లభిస్తుంది. స్వామి ధరించిన మాలలోని తులసి ఆకులు తింటే విష్ణులోకం లభిస్తుంది.స్వామికి నివేదించిన అన్న ప్రసాదాన్ని తింటే అమృతం సేవించిన ఫలితం కలుగుతుంది.జీవితాంతం ప్రసాదం తీసుకుంటే, మోక్షం లభిస్తుంది.స్వామికి సమర్పించిన పాదోదకం, ఆచమనం,స్నానం చేయించిన జలాన్ని తీసుకున్నట్లయితే, పాపాలు తొలగిపోయి,సమస్త తీర్థాలలోని జలాలతోస్వామిని అభిషేకించిన ఫలితం లభిస్తుంది. దుష్టగ్రహ బాధ,రాక్షస పీడ,భూతాలపీడ,తొలగిపోతాయి.శవాన్ని ముట్టుకున్న దోషం,తినకూడనవి తిన్న దోషం,పోతుంది.అనేక వ్రతాలు ఆచరించిన ఫలితం కలుగుతుంది. ఐశ్వర్యం లభిస్తుంది.అకాల మరణం,రోగాలు పోతాయి.సురాపానం, మాంసభక్షణం చేసిన పాపం నశిస్తుంది.స్వామి నిర్మాల్యం ధరించి ఉన్నప్పుడు అశౌచ్య దోషంకలుగదు.జీవితాంతం ధరించినట్లయిన ముక్తి లభిస్తుంది.లక్ష్మీదేవితో కలసి ఉన్న స్వామిని అర్చించినట్లయిన ఎలాంటి కష్టం లేకుండా మోక్షం వస్తుంది.స్వామి నిర్మాల్యం,పాదోదకం,నైవేద్యం,దానం చేసినా, స్వామిని దర్శించుకున్నా,నమస్కరించినా,పూజించినా, తప్పకుండా మోక్షం వస్తుంది.

స్కాందపురాణంలోని వైష్ణవ ఖండంలోని జైమిని ఋషి సంవాదము(దమనక చరిత్ర)అను ముప్పై ఎనిమిదవ అధ్యాయం సమాప్తం.

# సందేశం

ఓ సోదరా! మన దేశం తపోభూమి. బంగారు పంటలకు నిలయం. శాంతి వెన్నెలలు కురిసే పుణ్యభూమి. ప్రపంచలో అఖండ కీర్తిని పొందిన భరత భూమి నా తల్లి అని గర్వంగా తల ఎత్తుకుని, చాటిస్తూ విజయఢంకా మోగిస్తూ, నీ దేశాన్ని గురించి కీర్తించు. నీ దేశ సౌభాగ్య సంపదలు అభివృద్ధి చెందడానికి నేను సహాయ పడతాను. ప్రపంచమంతా దీన్ని పూజించేటట్లు గా గొప్ప ప్రగతిని నెలకొల్పుతాను" అంటూ నీ మనస్సులో ప్రతిజ్ఞ చెయ్యి. నీ మతం, భాషా, సంస్కృతి ఏదైనప్పటికీ నీ నరనరాల్లో నిండిన భారతీయ భావన అహింసతో నిండిన ఈ ప్రపంచానికి నూతన కాంతులు ప్రసరిస్తూ కనిపించాలి. సమస్త ప్రపంచానికీ శాంతిని నేర్పినప్పటి భారత మాత నీ తల్లి. కాబట్టి ఆమె సమజ్వాల కీర్తిని నిలబెట్టాల్సిన బాధ్యత నీదే. ఇటువంటి పుణ్య దేశంలో అసూయలు, దౌర్జన్యాలు, కుల మత హింసలనే పిశాచాలను తల ఎత్తనీయ కూడదు. నానాటికీ పెరిగిపోతున్న దుష్టులు మోసగాళ్ల గుండాయిజం నిలువకూడదు. బలిష్ఠమైన దేశ సౌభాగ్యాన్ని లంచాలనే జలగలు పట్టి పీల్చకూడదు. పగలు, ప్రతీకార సెగలు రగిలించే మాటలు ప్రతినిధులైన వాళ్ళు మాట్లాడకూడదు. మన మంతా అన్నదమ్ములమనే తీయనైన ధర్మానికి దెబ్బ తగల నీయకూడదు.

అలా జరిగినప్పుడు సమైక్యత అనే ఢంకా మ్రోగి నవ భారతాన్ని గురించి ప్రపంచం అంతా పొగుడుతుంది.

గంగ, బ్రహ్మపుత్ర, కృష్ణ, కావేరి, గోదావరి, సింధు, నర్మద అనే జీవ నదులు ఈ దేశ సౌభాగ్యానికి, ధాన్యాగారాలకు ముఖ్యమైన ఆధారం . అఖండమైన సౌభాగ్య సంపదలు కలిగిన ఈ దేశం ప్రపంచానికే అధిపతి అయ్యింది.

గాంధీజీ పలికిన పలుకులకు ప్రపంచమంతా జేజేలు పలికింది. మన జాతికి ఖ్యాతి వచ్చింది. అటువంటి మహాత్ముని కన్న భూమి నేడు ఆయన ఆశయాలకు అనుగుణంగా లేకపోవడం మనందరి దురదృష్టం.

భారత జాతి తలెత్తుకుని ప్రపంచ వీధిలో సగౌరవంగా, హుందాగా, తిరిగినప్పుడే గొప్ప కీర్తి కలుగుతుంది. మన దేశానికి అటువంటి సౌభాగ్యం కలిగే విధంగా శాంతిని పెంపొందించడానికి సరైన సమయం ఇదే. అందుకు సిద్ధం కండి. ఎందుకంటే పోయిన కాలం తిరిగి రాదు కదా!

దేశ భక్తి, దేశ సమగ్రత అనే భావాలు ప్రజల నరనరాల్లో వ్యాపించి పుణ్య భూమి అయిన అఖండ భారత దేశంలో ప్రగతి జెండా రెప రెప లాడుతుంది.

గాంధీజీ సందేశం ఈ విషయంపై గాంధీజీ ప్రజలకు ఇచ్చిన మరో సందేశం ఈ విధంగా ఉన్నది. ఈ పరతంత్ర జీవితాన్ని విడనాడి , మానవ జీవిత పరి పుష్టి కోసం ముల్లోకములు గెలిచిన వారి బిడ్డలు ఈ పరపీడా పరాయణత్వంలో ఉందురా? సమయం ఆసన్నమైనది భారత ప్రజలారా! లెండిక అని స్వతంత్ర సమరానికి కుట్రలు చేయడానికి కఠారులు, ఈటెలు, అవసరం లేదు. శత్రువుల ప్రాణములు తీయుట లేదు. వారి రక్తాన్ని జున్ను తినే విధంగా జుర్రుట లేదు. ఈ ప్రపంచ చరిత్రలో కనీ వినీ ఎరుగని రీతిలో జరిగే యుద్ధము నిర్వహించుడు అని శాంతి అహింసలతో పోరాడిన గాంధీజీ సందేశాన్ని మనందరికీ అందిచ్చారు. మీ అందరికీ వినిపించే అవకాశం వచ్చినందుకు కృతజ్ఞతలు.

స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు .

మామిడిపూడి విజయలక్ష్మి శ్రీనివాస్
రాజవోలు.

# నూటపదహార్లు కందాల్లో సుందరకాండ



పాలెపు బుచ్చిరాజు

## మనవి

వాల్మీకి రామాయణం మహోత్కృష్టమైన కావ్యం. ఎవరె న్నిసార్లు రాసినా ఇంతకంటే ఎక్కువగా ఏం చెప్పగలరు? యావద్భారత దేశంలో ఎన్నో భాషల్లో ఎందరో మహానుభావులు రచించి, చదివి, విని ధన్యులయ్యారు. ఉత్తర భారత దేశంలో గోస్వామి తులసీదాసు రచించిన “రామచరితమానస్” కి ఉన్న ప్రాచుర్యం మరి దేనికీ లేదు. అఖండ రామాయణ పారాయణం, సుందర కాండ పారాయణం, హనుమాన్ చాలీసా ప్రతి రోజూ ఎక్కడో ఒక దగ్గర వినిపిస్తూనే ఉంటాయి. తెలుగులో కూడా వెయ్యేళ్ళుగా వేలాది భక్తులు రామాయణాన్ని రాసి, చదివి, విని తరించారు.

రామాయణంలో రాముడి తరవాత విశిష్టమైన పాత్ర హనుమది. స్వామి భక్తికి, కార్య దీక్షకి, బుద్ధికుశలతకి కొలమానంగా చిత్రించాడు వాల్మీకి. అసలు రామాయణంలో సుందర కాండ ప్రత్యేకంగా హనుమ కోసమే సృష్టించ బడింది అనిపిస్తుంది. సీతాన్వేషణలో హనుమ చేసిన అధ్భుత కార్యాలకి అబ్బురపడి శ్రీరాముడు “నువ్వు నా తమ్ముడు భరతుని వంటి వాడవ”ని ఆప్యాయంగా కౌగలించుకున్నాడు. భక్తి తత్వానికి ఉదాహరణగా రచించ బడింది కనుకనే సుందర కాండ ప్రత్యేకంగా పారాయణకి నోచుకుంది.

నాటి రామదాసు, త్యాగరాజు నుంచి, నేటి ఎం. ఎస్. రామారావుగారి వరకు ఎందరో మహానుభావులు శ్రీరామ హనుమలను కీర్తించడం ద్వారా ధన్యులయ్యారు.

వారిని స్ఫూర్తిగా తీసుకుని ‘వంద కందాల్లో సుందర కాండ’ రాద్దామనే ప్రయత్నం చేశాను. ‘అష్టోత్తర శతం’ దాటినా హనుమంతుని తోకలా పెరుగుతూ పోయింది. ఆఖరికి ‘నూటపదహార్లు’ తో పూర్తి చేయ గలిగాను. చదువరులు ఆదరిస్తారని ఆశిస్తున్నాను.

ఆఖర్న అనుబంధంగా “పురజన గీత” గా పద్దెనిమిది కందాలు చేర్చాను. పట్టాభిషేకం తరవాత శ్రీరాముడు తమ్ముల్ని, మంత్రుల్ని, సామంతుల్ని, సైన్యాన్ని ఉద్దేశించి ఎవరెలా మసలుకోవాలో మాట్లాడాక, పుర ప్రజల్ని కూడా పిలిపించి వారికి భక్తి తత్త్వం బోధిస్తాడు. ఆ కారణంగానే దీనికి ‘పురజన గీత’ అని పేరు. తులసీ రామాయణం ఆధారంగా రాసిన పద్యాలు.

బరోడా

పాలెపు బుచ్చిరాజు

# పురజన గీత

## (అనుబంధము)

4) వచ్చిరి బాలురు వృద్ధులు
వచ్చిరి విప్రులు అబలలు వణిజులు వరుసన్
తెచ్చిన కానుక లిచ్చిరి
మెచ్చిన రాముని గొలిచిరి మెదలక వినుచున్

5) ప్రజలారా వినిపించెద
నిజమిది ధర్మము నిరతము నిల్పుడు మదిలో
నిజవిధుల మరువకుడదియె
అజరామరమై కడకిల అక్కర తీర్చున్

6) చేతోమోదము పొందగ
నాతోడై నిలుపుడు హరి నామము మీరల్
నాతోచిన విధమిది విని
మీ తోచిన దాచరించ మేలగు మీకున్

7) కానగ నెన్నియొ లక్షల
యోనుల జీవుడు దిరుగుచు యోగవశమునన్
మానవ జన్మము నెత్తెను
దాన నిరతము హరి గొల్చి ధన్యులు గారే

8) మనిషై పుట్టగ చాలదు
మనుజుడు మరుజన్మలేమి మరువగ తగవే
మనుగడ మార్గము చెప్పెద
మనసున భక్తియె నిలుపుట మార్గము మీకై

# పింగళి వెంకయ్య

భారత్ కు రత్నం లాంటి మనిషి జీవితాన్ని ఒకసారి మననం చేసుకుందాం

ఆ ఊరిపేరు నడిగూడెం సూర్యపేటనుంచి 30 కిలోమీటర్లు వుండొచ్చు, ఇప్పుడంటే సూర్యపేట జిల్లాలో వుంది కానీ 1956 నవంబరు 1 కి ముందు కృష్ణాజిల్లాలో భాగంగా వుండేది. ఆ నడిగూడెంలో ఒక ప్రముఖ పరగణా మునగాల. లచ్చమ్మారావు, దేశముఖు నాయని వెంకటరామయ్య దంపతులకు దత్తపుత్రుడు జమీందారు రాజా బహదూర్ నాయని రంగారావు గారికి 1906లో జరిగిన కాంగ్రెస్ మహాసభల్లో పింగళి వెంకయ్యగారితో పరిచయం ఏర్పడింది. రాజావారి కోరిక మేరకు పింగళి వెంకయ్య గారు మునగాల పరగణాకు ఆహ్వానించబడ్డారు. పైగా అక్కడ కొమర్రాజు వెంకట లక్ష్మణరావుగారు దీవాన్ గా పనిచేస్తున్నారాయే. పింగళి వారికి నడిగూడెంలోనే నివాసం ఏర్పాటు చేసారు, పత్తిపై ఒక పరిశోధనా క్షేత్రాన్ని స్థాపించారక్కడ. పేరుకు రాజాగారే కానీ వెంకయ్యగారికంటే పదమూడేళ్ళు వయసులో




చిన్ని, పైగా ఈయనంటే ఒక అభిమానం చాలా గౌరవంగా చూసుకునేవారు. 1906 నుంచి 1911 వరకు వెంకయ్య కేవలం పత్తి పంట మీద పరిశోధనలు చేశారు. అప్పుడే ఆయనకు 'పత్తి వెంకయ్య' అన్న బిరుదు వచ్చేసింది.

ముప్పయ్యేళ్ల యువకుడు మన పింగళి వెంకయ్య కానీ అప్పటికే పదేళ్ళ క్రితమే బోయర్ యుద్ధంలో పాల్గొన్న అనుభవంతో పాటు తిరుగుప్రయాణంలో అరేబియా, ఆఫ్ఘనిస్థాన్ లను చూసుకుంటూ వచ్చిన ముచ్చట్లు అక్కడి మిత్రులతో రైతులతో చెప్తుండేవారు. 19 ఏళ్ళ వయసుకే తను పాల్గొన్న బోయర్ యుద్ధం గురించి చెపుతూ దేశీయ సంపదను దోచుకునే వాళ్ళు ఎన్ని కల్లబొల్లి కబుర్లయినా చేపుతారు. మనం వాటిని సృష్టించుకోవడం ఎంత అవసరమో కాపాడుకోవడమూ అంతే అవసరం అంటారాయన. బోయర్ యుద్ధం గురించి చెప్పాలంటే కెజియఫ్ స్టోరీకన్నా పెద్ద బంగారు గనుల కథ చెప్పాలి వాటికోసం దేశాల మధ్య కుమ్ములటను అర్థం చేసుకోవాలి. 1886లో విట్ వాటర్సాండ్ లో దాదాపు పదిహేడు వేల చదరపు మైళ్ళ విస్తీర్ణంలో విశాలమైన బంగారు నిక్షేపాలున్న ప్రాంతాన్ని కనుగొన్నారు. బంగారం అంటే మట్టిని జల్లించుకుంటూ సేకరించుకోవడమే దీనిమీద ప్రపంచవ్యాప్తంగా గోల్డ్ డిగ్గర్స్ ఎగబడ్డారు. అక్టోబరు 11, 1899 నుండి మే 31,

1902 వరకు రెండవ సారి బోయర్ యుద్ధం జరిగింది. ఇంతకీ బోయర్ లు అంటే దక్షిణ ఆఫ్రికాలోని డచ్ నివాసితులు అన్నమాట, 1899 లో, బ్రిటీష్ మరియు బోయర్స్ మధ్య వివాదం మూడు దశల్లో జరిగింది. యుద్ధం యొక్క మొదటి దశ బోయర్స్ బ్రిటీష్ దళాలపై పైచేయి అయ్యింది , కాని తరువాతి రెండు దశలు బ్రిటీష్ వారే ఆదిపత్యం చూపారు. సరే అదంతా పక్కన పెడితే సహజ సంపదలను వినియోగించుకోవడం ద్వారా దేశాభివృద్ధి జరుగుతుంది అనే పాయింటు ప్రధానమైనది. భారతదేశం విషయానికి వస్తే మనది సమశీతోష్ణ మండలం మొక్కల పెరుగుదలకు అత్యద్భుత ప్రాంతం మందు మొక్కలు మషాలా దినుసుల కోసం ఇండియాపై ఎన్నిదేశాలు ఆతృతగా వచ్చేవో మనకు చరిత్ర చెపుతుంది. మనదేశంలో రాతి నిల్వలు, ఖనిజ సంపద కూడా అపారంగా వుంది. ప్రపంచంలోనే అతిపెద్ద అతి గొప్ప వజ్రాలు దొరికింది మనదగ్గరినుంచే. వెంకయ్య గారు బహుశా యుద్ధం సందర్భంలో ఏమోం గమనించారో కానీ, మద్రాసు రైల్వే గార్డు ఉద్యోగమో, బళ్లారి లో చేసిన ప్లేగు అధికారి ఉద్యోగమో ఆయన మనసుకు తృప్తినిచ్చినట్లు లేవు. అంతకు మించిన పనేదో చెయ్యాలి అనుకుంటున్న సమయంలోనే విదేశీ వస్తు బహిష్కరణ ఉద్యమ వీచికలు పింగళి వెంకయ్య గారిలో మరింత లోతు ఆలోచనలను రేకెత్తించాయి. విదేశీ వస్తువులను బహిష్కరించడంతో పాటు స్వదేశీ సంపదను మరింత పటిష్టపరచుకోవాలి కదా అనుకున్నారు. వ్యవసాయ ప్రధాన దేశంలో ఆర్థికంగా లాభం ఇవ్వగల పద్ధతులపై పరిశోధనలు జరగాల్సి వుంది. వెంకయ్య గారు అదే మొదలేసారు. పత్తిపంట నూలు వడకడమే కాక నీలిమందు అద్దకంలోనూ ప్రముఖపాత్ర వహించిన నాగులవంచ వంటి ప్రాంతాలిక్కడివే కదా. గాంధి స్వదేశీ అంటే ప్రదానంగా నూలు వడకడాన్ని సింబాలిక్ గా తీసుకుని ఉద్యమాన్ని ముందుకు తీసుకెళుతున్న రోజులు, అందుకు ఊతంగా పత్తిలో రైతులు ఎదుర్కొనే కష్టాలకు నివారణ కనుక్కోవాలనుకున్నారు. కంబోడియా నుంచి మేలు రకం పత్తి విత్తనాలను తెప్పించి స్వదేశీ రకాలతో సంకరం చేసి వచ్చిన కొత్త విత్తన రకాల ఉత్పత్తి ఎలావుంది చీడపీడలనుంచి తట్టుకునే గుణం ఎలా మెరుగుపడింది వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశోధించారు. మెరుగైన ఫలితాలను సాధించారు. అందులోని నాణ్యతని గుర్తించిన ది రాయల్ అగ్రికల్చరల్ సొసైటీ (లండన్) ఆయనను ఫెలోషిప్‌తో గౌరవించింది. పత్తి పంట పై పరిశోధనలతోనే ఆపకుండా మన ప్రాంతపు మరో ముఖ్యమైన అపురూప ఆదాయ వనరు ఎక్కువగా బ్లాక్ మార్కెట్ లోకే కానీ దేశసంపదలోకి చేరని వజ్రాల ఉనికిపైన తీవ్ర పరిశోధనలు చేసారు. జియాలజీలో పట్టభద్రుడైన ఆయన మన ప్రాంతపు వజ్రాల తవ్వకాలలో రికార్డు సృష్టించారు. నవరత్నాల మీద అనేక పరిశోధక వ్యాసాలు రాశారు. ఈ విషయంలో ఆయన భారత ప్రభుత్వ సలహాదారుగా కూడా పనిచేశారు. జాతిరత్నాలు, వాటిని పోలి ఉండే రాళ్లు దేశంలో చాలా చోట్ల దొరుకుతాయని ఆయన చెప్పేవారు. రాయల వారి కాలంలో రత్నాలు, వజ్రాలు అంగళ్లలో పోసి అమ్మేవారని చదవుకున్నాం. పోర్చుగీసు, డచ్, ఈస్టిండియకంపెనీ వంటి విదేశీయులెందరో మన-

దేశంనుంచి వజ్రాలను తరలించిన సంగతులు చదువుకున్నాం, ఇప్పటికీ జొన్నగిరి, కొల్లూరు వంటి ప్రాంతాలలోని పొలాల్లో వజ్రాలు దొరుకుతున్నాయన్న వార్తలూ చదువుతున్నాం. కానీ నేటి ఆత్యాధునిక పరికరాలు పరిజ్ఞానం సహాయంతో వాటి ఉనికిని దేశసంపదగా మార్చే ప్రయత్నాలు ఎంతవరకూ చేయగలుగుతున్నాం. కర్బన రూపాంతరాలైన బొగ్గు గ్రాఫైట్ వజ్రం నిల్వలు ఏర్పడటానికి అవకాశం వున్న నేలలపై కింబర్లైట్ ట్యూబ్స్ వున్న కొన్ని జిల్లాలలోనూ, కోరండం నిల్వలు హెచ్చుగా వున్న ప్రాంతాలలోనూ ప్రజలకు ప్రభుత్వానికి ఆదాయం చేరే పద్ధతులు ఎన్ని- అనుసరిస్తున్నాం అనేది ఇంకా సరిచూసుకోవలసిన అంశమే అనిపిస్తుంది. 1924 నుండి 1944 వరకు నెల్లూరు ప్రాంతంలో ఉంటూ మైకా (అభ్రకం) గురించి పరిశోధన చేశాడాయన. కొలంబో వెళ్లి సీనియర్ కేంబ్రిడ్జ్ పూర్తి చేసుకుని వచ్చారు. భూగర్భశాస్త్రం అంటే ఉన్న అపారమైన ప్రేమతో అదే అంశంలో ఆయన పీహెచ్‌డీ చేసి డాక్టరేట్ పొందారు డాక్టర్ వెంకయ్య. దేశానికి స్వాతంత్ర్యం లభించిన తరువాత ప్రభుత్వం వెంకయ్యను ఖనిజ పరిశోధకశాఖ సలహాదారుగా నియమించింది. ఆ పదవిలో ఆయన 1960 వరకు అంటే ఆయనకు 82 ఏళ్ల వయసు వచ్చే వరకూ పనిచేసారు. అంత విలువైన పదవిలో వుంటూ కూడా తనకుంటూ వెనకేసుకోక పోవడం ఒక కోణంలో ఆయన నిజాయితీ నిబద్ధతలను చూపెడుతుంటే మరోవైపు నేటి కాలపు కొలతల ప్రకారం బ్రతకనేర్వని తనాన్నీ చూపెడుతోంది. వెంకయ్యగారిది పెద్దకుటుంబమే ఈయనకు ఐదుగురు సోదరులు ఇద్దరు సోదరీ మణులు, వీరి తాతగారి పేరునే హనుమంతరాయుడు గారు ఈయనకు పెట్టారు. వెంకయ్య వారి సతీమణి రుక్మిణమ్మ గార్లకు ముగ్గురు సంతానం ఇండియన్ ఎక్స్‌ప్రెస్ లోనే కాక పదునైన రచనల జర్నలిస్టుగా పేరుపొందిన పరశురామయ్య (భార్య దమయంతి) పెద్దకుమారుడు వారికి అన్నపూర్ణ, నాగలక్ష్మి, భవాని మూడవతరం. ఇక సైన్యంలో చేరిన రెండవ కుమారుడు పింగళి హేరంబ చలపతి రావు(భార్య జానకి) దేశం కోసం చిన్న తనంలోనే ప్రాణాలను వదిలారు. చలపతిరావుగారబ్బాయే పింగళి దశరథ రామ్(సుశీల) పెద్దనాన్న గారి జర్నలిజం వారసత్వంగా తీసుకున్నట్లు ఎన్‌కౌంటర్ పత్రికను నడిపింది ఈయనే. దశరథ రామ్ గారికి చైతన్య, అవినాష్, వెంకయ్యదశరథరామ్ అనే పిల్లలు పింగళి చైతన్య రచయిత్రిగా పేరు సంపాదించింది. ఈమె వ్రాసిన చిట్టగాంగ్ విప్లవ వనితలు అనే పుస్తకం కేంద్ర సాహిత్య అకాడమీ నుండి 2016లో యువ పురస్కారాన్ని తెచ్చిపెట్టింది. వెంకయ్య గారి అమ్మాయి పేరు సీతామహాలక్ష్మి వీరిని ఘంటశాల ఉగ్రనరసింహం గారికిచ్చారు. 1916లో ఆయన ఆంగ్లంలో రాసిన నేషనల్ ఫ్లాగ్ ఇన్ ఇండియా అనే గ్రంథానికి అప్పటి వైస్రాయ్ కార్యనిర్వాహక సభ్యుడు, కేంద్ర మంత్రి నరసింహేశ్వర శర్మ పీఠికరాశారు. అందులో 30 రకాల జెండా నమూనాలను ప్రతిపాదించి అందరినీ మెప్పించాల్సి వచ్చింది. 1921లో విజయవాడలో కాంగ్రెస్ సదస్సులో ఆమోదం కూడా పొందారు. జలియన్‌వాలా బాగ్ దురంతానికి నిరసనగా చేపట్టిన కార్యక్రమంలో 1923 ఏప్రిల్ 13న నాగ్‌పూర్‌లో స్థానిక కాంగ్రెస్ కార్యకర్తలు తొలిసారిగా

పింగళి జెండాను ఎగురవేశారు. 1921లో పింగళి రూపొందించిన త్రివర్ణ పతాకాన్ని 'స్వరాజ్' పతాకంగాను.. 1931లో ఆమోదించిన త్రివర్ణ పతాకాన్ని 'పూర్ణ స్వరాజ్ పతాకం'గాను అంటుంటారు. చరఖా స్థానంలో బుద్ధుడి ధర్మ చక్రాన్ని చేర్చాలని రాజ్యాంగసభ చైర్మన్ డాక్టర్ అంబేడ్కర్ ప్రతిపాదించారు కానీ. ధర్మచక్రానికి బదులు అశోక చక్రాన్ని చేర్చాలన్న ప్రతిపాదన మీద రాజ్యాంగసభ సిఫారసు చేయడంతో నెహ్రూప్రభుత్వం సవరణ ఆమోదం తెలిపింది. త్రివర్ణ పతాకాన్ని 22 జూలై, 1948న జాతీయ పతాకంగా భారత జాతి స్వీకరించింది. ఇంకెవరో కూడా ఇటువంటి నమూనానే చేసారు. అంటూ మరేదో ఉదాహరణ చూపగానే పింగళి వెంకయ్యగారు కాదట అని హడావిడిగా అనేసే తెలుగు వాళ్ళ మధ్యన ఇంకా ఆయన అనామకంగానే మిగిలిపోయారు. ఆయన సమగ్ర చరిత్ర చాలినన్ని ఫోటోలు సైతం వెలుతురులోకి రాలేదు. ఆయన రాసిన పుస్తక ప్రతులైనా దొరుకుతాయో లేదో తెలియదు. జవసత్వాలుడిగిన ముసలి రూపాన్ని మాత్రమే ఊహించుకునే మనకు



బోయర్ యుద్ధంలో పోరాడిన యోధుడు వెంకయ్య, పట్టా పొందిన డాక్టర్ వెంకయ్య, దేశపు హృదయంపై రెపరెపలాడే జెండా వెంకయ్య కంబోడియా రకంపై పరిశోధనలు చేసిన పత్తి వెంకయ్య, వజ్రాలపై అపారసమాచారం ఇచ్చిన డైమండ్ వెంకయ్య, ఉద్యమ పోరాటాలకు ముందు దారి చూపిన దార్శనికుడు వెంకయ్య, అపురూప విశేషాలు పంచిన రచయిత వెంకయ్య, అనర్గల పాలీగ్లాట్ జపాన్ వెంకయ్య, పెద్ద పదవుల్లో కూర్చున్నా తాటాకు ఇంటినే మిగుల్చుకున్న నిజాయితీ వెంకయ్యను మనం ఎప్పటికి చూడగలుగుతాం. రత్నం లాంటి ఈ మనిషిద్వారా భారత రత్నబిరుదుకు వన్నె ఎప్పుడు అద్దుతాం.

దివి తాలూకా యార్లగడ్డ గ్రామ కరణం పింగళి హనుమంతరాయుడు , వెంకటరత్నమ్మలకు కృష్ణా జిల్లా మచిలీపట్నం సమీపాన ఉన్న ప్రస్తుత మొవ్వ మండలములోని భట్లపెనుమర్రు గ్రామములో జన్మించిన పింగళి వెంకయ్యగారు అనేక హోదాలు, అనేక దేశాలు, అనేక పరిస్థితులనూ చూసి చివరికి జూలై 4,1963లో బెజవాడలో ఒక తాటాకు ఇంట్లో కన్నుమూసే ముందు తన ఆఖరికోరికగా జాతీయ జెండాను తన పార్థివదేహంపై కప్పాలని అంతిమ స్థలిచేరిన తర్వాత ఆ జెండాను అక్కడి రావిచెట్టుకు కట్టాలని కోరుకున్నారు. ఆయన ఆఖరికోరికే నేడు అసువులుబాసిన వీరులకు అత్యున్నత అంతిమ పురస్కారమై నిలచింది. బిగ్ శెల్యూట్ వెంకయ్య గారూ ఇవి మా తరపున మీ జయంతి నివాళులు.

# హితోక్తులు

క్రోధోమూల మనర్థానాం, క్రోధ: సంసార బన్ధనమ్
ధర్మ క్షయంకర: క్రోధ:, తస్మాత్క్రోధం విసర్జయేత్॥

కోపం అన్ని అనర్ధములకు కారణం. కోపం, సంసార బంధనములకు కారణము.(మోక్షమునకు అవరోధము) కోపము ధర్మమును నశియింప జేయును. అందువలన కోపమును విడవవలెను.

అస్థిరం జీవనం లోకే, అస్థిరం యవ్వనం ధనం
అస్థిరం దారు పుత్రాద్రి, ధర్మ కీర్తి ద్వయం స్థిరం॥

జీవించడం శాశ్వతం కాదు. యవ్వనం ధనం శాశ్వతం కాదు. భార్యాబిడ్డలు శాశ్వతం కాదు. కేవలం మనం పొందిన ధర్మం కీర్తి అనేవే శాశ్వతం.

భార్య యనెడు నొక్క భారమ్ము లేనిచో, పుల్లియాకువోలెంరుషుడెగురు
దారి తప్పనీని దైవమ్ము, భార్యరా, విశ్వదాభి రామ వినురవేమ ॥

భర్త ఎంగిలి విస్తరాకు వంటివాడు. దానిపై బరువు వంటిది భార్య. ఆ బరువు లేకుంటే ఆకు ఎగిరిపోతుంది. స్థిరంగా ఉండదు. అలాగే భార్య లేకపోతే మగవాడు స్థిరత్వాన్ని కొల్పోతాడు. మగవాడు దారి తప్పకుండా సక్రమ మార్గంలో ఉండే దైవమే భార్య. (జీవితాన్ని చక్కదిద్దే దేవత వంటిది భార్య అని అర్ధము.)

# దేవదేవుని పంచ భూత లింగాలు



## ఆకాశ లింగం ` చిదంబరుడు

కొత్త రామానందం




మనకు పంచ భూతాలను ప్రతిబింబించే క్షేత్రాలున్నాయి. భూమి, ఆకాశం, అగ్ని, నీరు, గాలి అంటూ పంచ భూతాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న క్షేత్రాలలో, తమిళనాడులోని చిదంబరం ఆకాశ అంశాన్ని ప్రతిబింబిస్తుంది. చిత్ అంటే జ్ఞానం, ఆనందం అనే అర్థాలున్నాయి. అంబరం అంటే ఆకాశం, ఈ రెండు అనంతాలు ఏకమైన పుణ్యభూమే చిదంబరం, కాశీలో మరణిస్తే మోక్షం లభిస్తుంది. శ్రీశైల శిఖరాగ్ర దర్శనం వల్ల పునర్జన్మ ఉండదని అన్నట్టే చిదంబరాన్ని దర్శించుకున్నంత మాత్రానికే ముక్తి లభిస్తుందని అంటారు.

చెన్నై నగరానికి దక్షిణంగా సుమారు 250 కి.మీ దూరంలో దక్షిణ ఆర్కాట్ జిల్లాలో కావేరినది శాఖ అయిన కొలరూన్‌కి ఉత్తారాన, మణిముక్తానదికి దక్షిణంగా చిదంబరం పట్టణం ఉంది. ఈ స్థల ప్రాచీన నామం 'తిల్లయ్‌వనం' తిల్లయ్ అంటే మర్రిచెట్టు, ఆలయస్థల వృక్షం పేరు కూడా తిల్లయ్ కావటం గమనార్హం. గతంలో ఈ ప్రాంతంలో ఈ వృక్షాలు విస్తారంగా వ్యాపించి ఉండటం చేత ఈ పేరు వచ్చింది. చిదంబరానికి ఇంకా వ్యాఘ్రపురం, పుండరీకపురి, పులియార్ పోన్నంబళం మున్నగు నామాలు కూడా ఉన్నాయి. విశ్వవిజ్ఞానుల దృష్టిలో చిదంబరానికి విశిష్టమైన స్థానం ఉంది. విరాట్ పురుషుని విపుల రూపంలో ఇది హృదయ స్థానం. తిరువణ్ణామలై మణిపూరకంÑ శ్రీకాళహస్తి ` కంఠంÑ కాంచీపురం ` జీవస్థానంÑ జంబుకేశ్వరం నాభిÑ కాశీ `కనుబొమల మధ్య-

ప్రదేశం. హృదయ స్థానం పరమపావన స్థానంÑ కనుకనే ఇక్కడ శివ మహాదేవుని నాట్యమూర్తి అయిన ఆనంద నటరాజస్వామి అధిష్ఠాన దైవంగా అలరాలుతూ ` లోక కళ్యాణం కోసం, సాధుజనులైన భక్తుల యోగక్షేమాలకోసం సదా ఆనందతాండవం చేస్తున్నారు. సృష్టి ఆదిన ప్రారంభమయిన ఈ ఆహ్లాద నర్తనం సృష్టి అంతం వరకు అప్రతిహతంగా కొనసాగుతూనే ఉంటుందని విజ్ఞుల విశ్వాసం. ఆలయం ముప్పైతొమ్మిది ఎకరాల విశాలమైన ప్రాంగణంలో నిర్మంచబడి ఎత్తైన ప్రాకారాలతో, నాలుగు గోపురాలను కలిగి ఉంది. ఆలయ ప్రాంగణంలోని శివగంగ కోనేరు 175 అ॥ పొడవు 100 అ॥ వెడల్పు కలిగి విశాలంగా ఉంది. ఉత్తర, దక్షిణ గోపురాలు ఒక్కొక్కటి 160 అ॥ ఎత్తులో గంభీరంగా కాన వస్తాయి. శ్రీకృష్ణ దేవరాయుల ఉత్తరం వైపు ఉన్న గోపురాన్ని నిర్మించినట్లు తెలుస్తున్నది. ఈ గోపురాల వాస్తు వైభవ శిల్పకళలతో, భరతనాట్య ముద్రలతో కనులపండుగ చేస్తున్నాయి. నాలుగు రాజగోపురాలను కలుపుతూ 30 అ॥ ఎత్తున సుదీర్ఘ గ్రానెట్ ప్రాకారం నిర్మింపబడిరది. వీరప్ప నాయకర్ పాలనా కాలంలో నిర్మితమైనందున దీనిని 'వీరప్పప్రాకారం' అనిపిలుస్తారు.

దక్షిణగోపురం గుండా ఆలయ ఆవరణలో ప్రవేశించగానే నైరుతి మూల ముక్కురు వినాయక ఆలయం చూడవచ్చును. 8అ॥ ఎత్తు కలిగిన ఈ తీరు సుందర విగ్రహం మనకు మారెక్కడా కానరాదు. పడమర గోపురం వెలుపలి ప్రదక్షణలో స్థలవినాయకుడైన కర్పక వినాయకర్ ఆలయం ఉంది. ఆయనను ''నాట్యగణపతి' అని అంటారు. ఉత్తరం వైపున బాల సుబ్రమణ్యస్వామి ఆలయం తిలకించవచ్చును. వెలుపల ప్రదక్షణలో సోమ సుందరార్ ఆలయం. దీనికి ఉత్తరం వైపున నూరుస్థంబాల మండపం, తిరుమల వినాయకర్ ఆలయం. ఎదురుగా పావన శివగంగ తీర్థం ఉన్నాయి. స్వచ్ఛజలాలతో కూడిన సుందరంగా తీర్చదిద్దబడిన విశాల తీర్థ స్థలం ఇది!



చిదంబరం ఆలయం ప్రస్తావన రాగానే అందరికి మనసులో మెలిగేవి అయిదు ప్రముఖ సభలు, ఈ సభలను



మండపాలు అని పిలుచు కొనవచ్చును. తమిళ శిల్ప కళాకారులు బహుసుందరంగా మలిచారు. వీటిలో తొలి సభ 'చిత్ సభ' (చిత్రాంబళం) శ్రీ నటరాజస్వామి వారి అందాల నిలయం, మరియు ప్రధాన ఆలయం ఈ సభలోనే రెండోది 'కనకసభ' (పొన్నంబళం) రత్న సభాపతి అయిన స్వామికి, కైలాస స్పటిక లింగానికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించే సుందర వేదిక. మూడోసభ 'దేవసభ' ఇది తూర్పు దిశలో ఉంది. ఉత్సవ మూర్తులకు అభిషేకాలు, అలంకారాలు వంటివి చేస్తారు. ఈ సభను పేరంబళం అంటారు. పంచమూర్తులకు నిలయమైన పావనస్థలంÑ నాల్గవసభ 'నృత్యసభ' స్వామి, ఊర్ధ్వతాండవం చేసిన మహిత మండపం. ఈ మండపం రథ చక్రాలను కలిగి అశ్వాలు లాగుతున్నట్టుగా నిర్మితమైంది. ఇక్కడ ఊర్ద్వతాండవ నటరాజు, కాళీమాతలు కొలువు తీరి ఉన్నారు. ఇక ఐదోసభకు 'రాజసభ' అనిపేరు. వేయిస్థంబాలతో కూడిన వైభవ మండపం. సుమారు 103 మీటర్ల పొడవు 58 మీటర్లు వెడల్పు గల ఈ మండపంలో పట్టాభిషేకాలు, నృత్యప్రదర్శనలు వంటివి జరుగుతాయి. ఆలయంలో ప్రతి సంవత్సరం నిర్వహింపబడే రెండు పెద్ద ఉత్సవాలకు ` అణి, మార్గళి మాసాలలో 9 రోజులపాటు ఇవి జరుగుతాయి.వాటి వేదిక ఈ రాజసభ. ఈ సభలలో, గౌడ, చోళ, పల్లవ, పాండ్య ఇతర పాలక వంశ ప్రభువుల పట్టాభిషేకాలను ఎంతో వైభవంగా నిర్వహించేవారు. ఈ విశాల సభలో మాణిక్య నాచకర్, సంబందర్, అప్పార్, నందనార్ వంటి సాదుభక్త కవులు స్వామి ఆశీస్సులతో విద్వత్ గోష్ఠులలో పాల్గొని ` విపరీత వాదాలు చేసే వితండ పండితులను, అసత్య ధర్మ ప్రచారాలు కావించే ప్రబుద్ధులును చిత్తుగా ఓడిరచి, పరమేశ్వర జ్ఞాన సిద్ధాంతాల ప్రశస్తిని లోకానికి వెల్లడిరచేవారు. దీన జనులకష్టాలను నివారించడానికి గాను నిస్వార్థ బుద్దితో మృత జీవుల బ్రతికించడం వంటి మహామహిమలను సైతం ప్రదర్శించి చరితార్థులయ్యారు.

అంతుపట్టని చిదంబరరహస్యం' 'చిదంబరం' పదం వినగానే వెంటనే 'రహస్యం'అనే పదం అసంకల్పితంగా మనలో చాలా మందికి తట్టడం అనుభవం లేని విషయమే. చిత్ సభలో నటరాజస్థూపం విగ్రహం ఉన్న అందాల మందిరంలో కుడివైపున చిన్న ద్వారం ఉంది. ఆ ద్వారం గుండా వెళితే లోపలి



గోడలో ఒక మహిత యంత్రం బిగింపబడి ఉన్నదని చెబుతారు. అయితే అది ఏ తీరు యంత్రమో లేక చక్రమో ఏమిటనేది ఇంతవరకూ ఎవరూ స్పష్టంగా చెప్పలేకపోతున్నారు. అక్కడ పూజారులు సైతం తమకు నిర్దిష్టంగా ఏమి తెలియదని చెప్పడం గమనార్హం.

రహస్య యంత్రం నెలకొల్పబడిన భాగంపై దట్టంగా చందనం అద్ది ఉంటుంది. ఆ యంత్ర స్థలాన్ని ఎవ్వరూ తాకరని, తాకరాదని, రాత్రివేళ తలుపులు వేసే ప్రధాన అర్చకుడు మాత్రం నూతన చందన చర్య గావించి అలంకారం చేసి సంప్రదాయ పద్ధతిని పూజారి నిర్వహిస్తారు. ఇతరులు ఆ గదిలో అడుగు పెట్టడానికి వీలులేదు. ఇక పరిమిత సమయాలలో మాత్రమే ఆ యంత్ర దర్శనం భక్తులకు అనుమతి లభిస్తుంది. గది బయట నుంచి గోడకు ఉన్న సందులో కిటికీ గుండా భక్తులు యంత్ర దర్శనం చేసుకుంటారు. ఈ దర్శన సమయం కూడా కొద్ది క్షణాలు మాత్రమే ఉంటుంది. యంత్రం ముందు ఉన్న చిన్న తెర తొలగించి హారతి వెలుగులో యంత్రాన్ని చూడమంటారు. అయితే అప్పుడప్పుడు అద్భుత దృశ్యం సాక్షాత్కరిస్తుంది! ఈ యంత్రంపై మెరిసే 'బంగారు బిల్వమాల' గోచరమవుతుంది. అక్కడ భక్తులకు సాధారణ దృష్టికి ఏమీ అగుపించదు. కానీ మనో నేత్రంతో చూడగలిగిన వాళ్లకు శివపార్వతులు కనిపిస్తారనేది నమ్మకం. స్వామి వారు ఎవరికి కనిపిస్తారో ఏ రూపంలో కనిపిస్తారో తెలియదు కనుక అది చిదంబర రహస్యంగా ప్రాచుర్యంలోకి వచ్చింది. తెర తొలగించినపుడు కనిపించే ఆ చోటునే 'శివోహం భవ' అని అంటారు. శివ అంటే దైవం అహం అంటే మనం భవ అంటే మనసు ఆ దైవంలో ఐక్యం అయ్యే ప్రదేశం అంటే అక్కడ ఏ రూపం లేకుండానే అజ్ఞానాన్ని తొలగించుకుంటూ, ఆ దైవసాన్నిధ్యాన్ని అనుభవించుటమే ఈ క్షేత్ర పాశస్త్యం.

చిదంబరం ఓ అద్భుత శక్తి క్షేత్రం. దీనికి అయస్కాంతశక్తి ఉన్నదని నటరాజ విగ్రహంలోని కాలి బొటనవేలు భూమధ్యరేఖలోని బిందువుని సూచిస్తుందని చెబుతారు. పరమశివుని ఆనంద తాండవ సుప్రసిద్ధ భంగిమల్లో ఒకటి స్వామి పాదం కింద ఉన్నది అజ్ఞానమనీ, చేతిలోని నిప్పు దుష్టశక్తులను నాశనం చేస్తుందనీ, పైకి ఎత్తిన చేయి సర్వజగత్తునీ రక్షిస్తుంద-

నీ, వెనుక ఉన్న వలయం విశ్వా-సానికి సంకేతమని, చేతిలోని డమరుకం జీవం పుట్టుక-ను సూచిస్తుందని చెబుతారు. భరతనాట్యం ఈ నటరాజ దేవాలయం నుంచే వచ్చిందట. చిత్రాంబళం లేదా చిత్‌సభ ఎత్తై-యిన చతురస్ర వేదికపై నిర్మి-తమైంది. ఇందులో భాగంగా మూడు వైపుల పొన్నాంబళం (కనక సభ) ఉంది. ఇక్కడే స్వామి సుందర స్ఫటిక లింగానికి, రత్న సభాపతికి ప్రతిరోజూ, ఆరుసా-ర్లు సశాస్త్రీయంగా, శ్రద్ధగా అభి-షేకాలు, పూజలు నిర్వహిస్తారు. ఈ అర్చన కార్యక్రమములను తిలకించుటకు భక్తులు అధిక సంఖ్యలో విచ్చేస్తారు.

ఈ స్ఫటిక లింగం ఆది శంక-రాచార్యుడు తన యోగ శక్తితో కైలాసం నుంచి తెచ్చిన ఆయి-దులింగాలలో అద్భుతమైనద-ని అంటారు. ఇది ఆత్మయోగ లింగం మహిత మోక్షలిం-గం అని విజ్ఞుల అభిప్రాయం. చిత్ సభ ముందు గల మండపంలో నిలబడి ఎదురుగా చూస్తే దక్షిణాముఖుడైయున్న శ్రీ నటరాజస్వామి సుందరమూర్తిని అక్కడనుంచి అంగుళం కదల కుండానే తలను ఎడమవైపు త్రిప్పి చూస్తే తూర్పుముఖమై-యున్న శ్రీ గోవింద రాజపెరమాళ్ సురుచిరమూర్తిని దర్శించుకో-గలం. ఇటువంటి ఏర్పాటును మనం మరెక్కడ చూడలేం. శి-వకేశవ అబేధ తత్వానికి.. ఈ ఆలయం ఒక నిదర్శనం. చిత్ సభలోనే ఉన్న శివకామ సుందరి దేవి ఆనంద నిలయం ఉంది.

అంతరాలయంలో కొలువు దీరిన అమ్మ దివ్యకాంతులతో మెరిసిపోతూ తనను దర్శించే ఆప్త భక్తుల ఇష్ట కామ్యాల-ను వెంటనే తీరుస్తుందని ఓ ప్రగాఢ నమ్మకం. ఆమెను భక్తి శ్రద్ధలతో అర్చించి పునీతులౌ-తారు. అమ్మవారి ప్రసాదంగా పూజా కుంకుమను స్వీకరిస్తారు. ఆలయ మొదటి ప్రాకారంలో పెరియనాయకి అని పిలవ-బడుతున్న పార్వతి అమ్మవారి గుడి ఉంది. ఆలయ ప్రాంగణ పశ్చిమ భాగంలో కుమార స్వామి వారు కొలువై ఉన్నారు. ఇచ్చట నంది విగ్రహం 19 అ॥ పొడవు 8అ॥ వెడల్పు 12 అ॥ ఎత్తులో ఏక శిలా విగ్రహం అందరిని అకట్టుకుంటుంది.

ఆలయ రెండవ ప్రాకారం-లో దక్షిణంవైపున కాలసంహార మూర్తి ఊర్ధ్వ తాండవ మూర్తి ఆలయాలు ఉన్నాయి. నృత్య-సభలో కాళికా దేవితో నాట్యం చేసిన సందర్భంగా స్వామి ఒక కాలు ఎత్తి ప్రదర్శించిన భంగిమ కారణంగా 'ఊర్ధ్వ తాండవ మూర్తి' అని వ్యవహరిస్తారు. ఈ సభకు సమీపంలోనే శరభే శ్వరుడు, దండాయుధపాణి,స్వామి ఆప్తభ-క్తులైన మాణిక్యవాచకర్, అప్పర్, జ్ఞాన సంబందార్, సుందరార్ మందిరాలు ఉన్నాయి. వీరందరు సుప్రసిద్ధులైన సమయాచా-ర్యులు మరియు ఈ క్షేత్రంలో అనుబంధాన్ని కలిగి ఉన్నారు. క్రీ॥శ 600`681 మధ్య నివసిం-చిన అప్పర్ (తిరువావు సర్) దేవాలయ ఆవరణలో పాదాలను మోపి నడవడం మహాపాపం-గా ఎంచి గర్భగుడి వరకు పొల్లు దండాలు పెట్టుకుంటూ వెళ్ళి, అలాగే వెనక్కి మరలివచ్చే వారట.

ఇక జ్ఞాన సంబందార్ (క్రీ॥శ 644 ` 660) మూడు సం॥ శిశువుగా ఉన్నప్పుడు అతని తండ్రి చిదం-బరానికి తీసుకురాగా చిదంబరే-శ్వరుని కొరిక మేర, పార్వతీ దేవి ఆబిడ్డకు బంగారు గిన్నెలో పాలు-పెట్టిందని, అందువల్లనే అతనికి తిరుజ్ఞాన సంబంధర్ అని పేరు వచ్చిందని ప్రతీతి. వ్యాఘ్రపా-దుడు, పతంజలి, నందనార్, తీరునీలకంఠ నాయునార్ అనబడే ఎంతోమంది భక్తులు ఈ క్షేత్రంలో ముక్తిని పొందారు. నందనార్ గురించి ఓ కథనం ఉంది. తంజావూర్ జిల్లా అద-నూరులో ఓ నిమ్నకులంలో జన్మించిన నందనార్ అపర శివ భక్తుడు. ఆయనొకసారి శివుని దర్శించుకోవడానికి వెళ్ళగా, అందుకు పూజారులు అనుమ-తించలేదట. అయితే అదే రోజు రాత్రి ఆలయ పూజారుల కలలో కనపడిన శివుడు, నందనార్‌కు ఆలయ ప్రవేశం కల్పించమని ఆజ్ఞాపించాడు.



స్వామివారి ఆనతి అనుసరించి నందనార్‌ను గర్భగుడిలో అనుమతించగా, తదేక దీక్షతో శివుని చూపిన నందనార్, జ్యోతిగా మారి స్వామిలో ఐక్యమైయ్యాడట. ఇలా ఆలయానికి సంబంధించిన అద్భుతమైన ఉదంతాలు మన మనసులనే భక్తి పారవశ్యంలో ముంచెత్తుతాయి.

చిదంబర క్షేత్రాన్ని దర్శించుటకు వేలాది భక్తులు మరియు కళాకారులు, చిత్రకారులు కూడా వస్తుంటారు. ఇక్కడి శిల్పసంపద శిల్పకారులకు చిత్రకారులకు ప్రేరణ ఇస్తున్నది. ఇక్కడి శిల్పాలు, నృత్యభంగిమలు నాట్యాచార్యులకు స్పూర్తినిస్తుంటాయి.

చిదంబర క్షేత్రం ఎన్నో పావన తీర్థాల పుణ్యప్రదేశంగా కూడా విశేష ప్రశస్తి గాంచింది. శివకామసుందరి అమ్మవారి ఆలయానికి ఎదురుగా నిర్మింపబడిన శివగంగలో తమిళ సంవత్సరాది రోజున, ఇతర శుభ ఘడియల్లోను, శివనామ స్మరణ గావిస్తూ స్నానం చేయడం మహాపుణ్యప్రదమని పెద్దలు చెబుతారు. ఇక ` స్వామి అంతరాలయం తూర్పున ఉన్న 'పరమానంద కూపం' సార్ధక నామధేయ అని ప్రసిద్ధిగాంచింది. ఈ బావిలోని నీరు స్వచ్ఛంగా ఉంటుంది. పూజా కార్యక్రమాలకు వినియోగిస్తారు.

ఈ పుణ్యక్షేత్రాన్ని జేరుటకు రైలు, బస్సు సౌకర్యాలు ఉన్నాయి. తిరుపతి నుంచి నేరుగా చిదంబరానికి బస్సు సౌకర్యం ఉన్నది. యాత్రికులు ఉండుటకు సత్రవులు, లాడ్జీలు దొరుకుతాయి. ఉదయం 4 గం॥ నుండి 12.30 వరకూ తిరిగి సాయంత్రం 4గం॥ నుండి రాత్రి 10.30 గం॥ల వరకు ఆలయం తెరిచి ఉంచుతారు.

ఓం నమశ్శివాయ.

# సోమనాథం పెళ్లి



ఎలెక్ట్రాన్

విదేశం నుండి విమానంలో దిగిన బ్రహ్మం బుర్రా దంపతులు, ఎయిర్ పోర్ట్ కి వస్తానన్న కర్రా సోమనాథం ఉరఫ్ సోము కోసం చాలాసేపు వేచి, విసిగి బంజారా హిల్స్ లో ఉన్న ఒక హోటల్లో దిగారు. చేసిన ఫోన్ కాల్స్ కి సమాధానం లేదు. పరిపరి విధాలా శుభాశుభమైన ఆలోచనలు పరుగులు తీసాయి. మిసెస్ ప్రమీలా బుర్రా సణుగుడు మొదలు పెట్టింది. ఏమైతే అవుతుందని చీకటి పడిన తర్వాత ఏడింటికి ఒక పుష్ప గుచ్ఛం, ఒక జానీవాకర్ ఫుల్ బాటిల్, ఒక ప్రియాంకా పెర్ఫ్యూమ్ బాటిళ్లతో జుబ్లీ హిల్స్ లోని సోము ఇంటికి వెళ్ళి కాలింగ్ బెల్ నొక్కారు. ఒకవేళ సోము కనక ఇంట్లో లేకపోతే అక్కణ్ణుంచి నేరుగా మిసెస్ బుర్రా క్లాస్ మేట్ మమతాలత ఇంటికి వెడదామనుకొన్నారు.

ఒక ఘూర్కా తలుపు తీసి లోనికి రానిచ్చాడు. హాల్లో ఎదురుగా సోము దంపతుల ఫోటో. ఫోటో ఫ్రేమ్ చుట్టూ రంగు కాగితాల కత్తిరింపులతో పూలదండ. ప్రమిద దీపంలా మినుమినుకు మంటున్న చిన్న ఎలక్ట్రిక్ బల్బ్. 'మైగాడ్!' అకొంటూ సోము పుష్పగుచ్ఛాన్ని ఫోటో ముందుంచి, సోఫాలో కూలబడ్డాడు. ప్రమీలా బుర్రా- తీసి సిద్ధంగా పట్టుకొన్న ప్రియాంకా పెర్ఫ్యూమ్ బాటిల్ ని తిరిగి హ్యాండ్ బ్యాగ్ లో పెట్టేసుకొంది. ఒకటా, రెండా? ఏభై ఎనిమిది డాలర్లు! 'హమ్మయ్య బ్రతికాన'నుకొంటూ, భర్త పక్కన కూలబడింది. ఏమైందని ఘూర్కాని బ్రహ్మం హిందీలో ప్రశ్నించాడు.

'కైలాసభూమికి పోయి పన్నెండు రోజులైంది సాబ్!' అని తెలుగులో తిరుగు సమాధానం ఇచ్చాడు.

"యాక్సిడెంట్ ఏదైనా జరిగిందా?"' బ్రహ్మం అడిగాడు. అవునన్నట్టుగా ఘూర్కాతలూపాడు.

"సోము తల్లిదండ్రులు, ఆమె తల్లిదండ్రులు బంధువులు వగైరాలు ఏరి?"

"అందరూ కైలాసభూమికి పోయారుసార్!"

అంతలోనే డోర్ బెల్ మోగింది. సోము, పక్కనే మరొక అందమైన అమ్మాయి. ఇద్దరికీ మెళ్ళో పూలదండలు. వారి వెనుకనే ఆడా మగా కలిసి మరో పది మంది దాకా ఉన్నారు. బుర్రా దంపతులకి తల గిర్రున తిరిగిపోయింది! పన్నెండోరోజు తిరగకుండానే వీడప్పుడే రెండో పెళ్లి చేసేసుకొన్నాడా?

"ఒరేయ్ బ్రహ్మం, ఎయిర్ పోర్ట్ కి రాలేకపోయాను, సారీరా! వద్దామనుకునే అనుకున్నాను. కావాల్సినవాళ్ళందరూ, 'పోయినవాళ్లెలానూ పోయారు. మరో అమ్మాయి సిద్ధంగా ఉంది. ముహూర్తం చాలా బావుంది.' అని మెడలు పట్టుకొని, వంచి, మెలిపెట్టి వెంటనే మళ్ళీపెళ్లి అన్నారు. 'అయితే నా మొదటి భార్య సమాధిముందే పెళ్లి జరగాలి!' అని, కండిషన్ పెట్టేసి ఒప్పేసుకొన్నాను. అందుకనే ఎయిర్ పోర్ట్ కి రాలేకపోయాను!"

వాళ్లందరి ముందూ సోముని తిట్టడానికి మనసొప్పక, బుర్రా ఏదోలా తలాడించాడు. ప్రమీల లేచి, ఫోటో ముందుంచిన పుష్ప గుచ్ఛాన్ని ఆ అమ్మాయికి అందించి, "విష యూ ఏ హ్యాపీ మ్యారీడ్ లైఫ్!" అంది. ప్రియాంక పెర్ఫ్యూమ్ బాటిల్ యివ్వడానికి మనసొప్పక ప్రమీల పర్సు మళ్ళీ తెరవలేదు.

సోము ఆడంగులనిద్దర్ని హాల్లో వదిలి, సోముని లోపలి గదిలోకి తీసుకుపోయాడు. నవ్వుఅపుకొంటూ, "ఒరేయ్ బుర్రా! నేను జిగురు ప్రొడక్షన్స్ వారి ధారావాహికల్లో నటిస్తున్నానన్న సంగతి నీతో చెప్పలేదు కదూ? హాల్లోని ఫోటోలోనిది నా మొదటి నాయిక. కారు ప్రమాదం సీన్ తో ఆమె పాత్ర ఫినిష్. యివ్వాళ కైలాసభూమిలో ఆమె సమాధి సెట్ ముందు ఈ నాయికతో పెళ్లి. వీళ్ళందరూ షూటింగ్ బృందం. సరే, మూత తెరువు!"అన్నాడు. మొదటి పెగ్ దిగగానే సోము లోగొంతులో అన్నాడు. "ఈ ధారావాహికలో అయిదుగురు నాయికలు! ఈమె మరో రెండు ఎపిసోడ్ల తర్వాత అగ్నిప్రమాదం సీన్ తో ఫినిష్. ఈ సంగతి ఆమెకు తెలియదు! ఆ తర్వాతి ముగ్గురు నాయికలూ సిద్ధంగా ఉన్నారు. ధారావాహిక నిర్మాణ వ్యయంలో ఏభై శాతం పెట్టుబడి నాదే మరి!"అన్నాడు.

తెరమీద కనబడాలనే కుతికి ఆడా, మగా తేడాలేదు మరి! ■

# భారతదేశంలో మహిళలు

భారతదేశంలో మహిళల పాత్ర కొన్ని సహస్రాబ్దాలుగా అనేక గొప్ప మార్పులకు లోనౌతూ వచ్చింది. ప్రాచీన కాలంలో పురుషులతో సమాన స్థాయి కలిగి ఉన్న భారతీయ మహిళలు మధ్య యుగంలో అధమ స్థాయికి అణచబడటం, అనేక మంది సంఘ సంస్కర్తలు తిరిగి వారికి సమాన హక్కుల కల్పనా కోసం కృషి చేయడం, ఇలా భారతదేశంలో-మహిళల చరిత్ర సమాహారంగా ఉంది. ఆధునిక భారత దేశంలో మహిళలు దేశ రాష్ట్రపతి, ప్రధానమంత్రి, లోక్ సభ సభాపతి, ప్రతిపక్ష నాయకురాలు వంటి అత్యున్నత పదవులను అలంకరించారు. భారత దేశ ఇటీవల రాష్ట్రపతి కూడా ఒక మహిళే .

## చరిత్ర

మహిళల పాత్ర గురించి ప్రత్యేకంగా చర్చించిన రచనలు చాలా తక్కువ. దీనికి ముఖ్యమైన మినహాయింపు త్రయంబక యజ్వస్త్రీ ధర్మ పద్ధతి. ఆటను తంజావూరులో సుమారుగా 1730 కాలంలో ప్రభుత్వ అధికారిగా పనిచేసాడు. ఈ రచన అవస్తంబ సూత్ర సమయం నుంచి స్త్రీ ప్రవర్తన మీద ఆక్షేపణలను కూర్చింది. 4వ శతాబ్దం ప్రారంభంలో కింది విధంగా సాగుతుంది.

ముఖ్యో ధర్మః స్మితిషు విహితో భర్తు శుశ్రుషాణం హి.

స్త్రీకి ఆమె భర్త సేవ ప్రాథమిక కర్తవ్యంగా విధించబడింది.

శుశ్రూష అనే పదం విస్తృత అర్థాలను కలిగి ఉంది. భగవంతునికి భక్తుడు ప్రమాణాల నుంచి బానిస సేవల వరకు అనేక అర్థాలు దీని పరిధిలోకి వస్తాయి.

## ప్రాచీన భారతదేశం ( మార్పు )

ప్రాచీన భారత దేశంలో మహిళలు జీవితపు అన్ని విభాగాలలోను పురుషులతో సమాన హోదా అనుభవించారని పరిశోధకుల అభిప్రాయం. అయితే దీనికి భిన్నమైన అభిప్రాయం వెలిబుచ్చిన వారూ ఉన్నారు. పతంజలి, కాత్యాయనుడు వంటి ప్రాచీన భారత వ్యాకరణ కర్తల రచనల ప్రకారం వేదకాలపు ఆరంభంలో మహిళలు చదువుకొనే వారని తెలుస్తోంది. ఆ సమయంలో మహిళలు యుక్త వయస్సులో పెళ్లి చేసుకునే వారని, వారు భర్తను ఎన్నుకునే హక్కును కలిగి ఉండేవారని ఋగ్వేద శ్లోకాలు తెలుపుతున్నాయి. ఋగ్వేదం, ఉపనిషత్తుల వంటి గ్రంధాలు అనేక మహిళల గురించి ముఖ్యంగా గార్గి, మైత్రేయి వంటి ఋషులు ద్రష్టల గురించి తెలుపుతున్నాయి.

ప్రాచీన భారతంలో కొన్ని రాజ్యాలు నగర వధువు వంటి సాంప్రదాయాలను కలిగి ఉండేవి. మహిళలు నగర వధువు శీర్షికను గెలుచుకోవడానికి పోటీ పడుతూ ఉండేవారు. ఆమ్రపాలి నగర వధువుకి మంచి ఉదాహరణ.

అధ్యయనాల ప్రకారం వేద కాలపు ఆరంభంలో మహిళలు సమాన హోదా హక్కులను అనుభవించేవారు. ఏమైనా తరువాత (సుమారుగా 500 బిసి) స్మృతులతో మహిళల హోదా తగ్గడం మొదలయ్యింది. బాల్య వివాహ సాంప్రదాయం సుమారుగా ఆరవ శతాబ్దంలో ప్రారంభం అయి ఉంటుందని భావిస్తున్నారు.మహిళలను మతపరమైన కార్యక్రమాలకు అనుమతించినప్పటికీ, ఎక్కువగా నిర్బంధాన్ని ఆంక్షలనూ ఎదుర్కొన్నారు.

## మధ్య యుగ కాలం:

ఈ మధ్య యుగ కాలంలో మహిళల స్థాయి ఇంకా దిగజారిందని చెప్పచ్చు. కొన్ని వర్గాలలో అయితే సతీ సహగమనం, బాల్య

వివాహాలు, విధవా పునర్వివాహాల నిషేధం వంటివి భారతదేశంలోని కొన్ని వర్గాల సామాజిక జీవనంలో భాగమయ్యాయి. భారత ఉప ఖండంపై ముస్లిముల ఆక్రమణ భారతీయ సమాజంలో పరదా ఆచారాన్ని తెచ్చింది. రాజస్థాన్ రాజపుత్రులలో జౌహర్ ఆచారం ఉండేది. భారత దేశంలోని కొన్ని ప్రాంతాలలో దేవదాసీలు లేదా ఆలయ స్త్రీలు లైంగికంగా వేధిపుకు గురయ్యేవారు. హిందూ క్షత్రియ రాజులలో బహుభార్యాత్వం విస్తృత వ్యాప్తిలో ఉండేది. చాలా ముస్లిం కుటుంబాలలో మహిళలు జెనానా ప్రాంతాలకి మాత్రమే పరిమితమయ్యేవారు.



ఈ పరిస్థితుల మధ్య కూడా కొంత మంది మహిళలు రాజకీయా, సాహిత్యం, విద్య, మత రంగాలలో రాణించారు. రజియా సుల్తానా ఢిల్లీని పరిపాలించిన ఏకైక మహిళా చక్రవర్తి. గోండు రాణి దుర్గావతి పదిహేనేళ్ళు పరిపాలన సాగించింది. ఆమె మొఘల్ చక్రవర్తి అక్బర్ సైన్యాధిపతి అసఫ్ ఖాన్ తో జరిగిన 1564 యుద్ధంలో ప్రాణాలు కోల్పోయింది. అక్బర్ యొక్క గొప్ప మొఘల్ సైన్యాన్ని 1590 లో చాంద్ బీబీ ఎదుర్కొని అహ్మద్ నగర్ ను రక్షించింది. జహంగీర్ భార్య నూర్జహాన్ సార్వభౌమాధికారాన్ని ప్రతిభావంతంగా చెలాయించి మొఘల్ మకుటం వెనుక ఉన్న నిజమైన శక్తిగా గుర్తింపు పొందింది. మొఘల్ యువ రాణులు జహానారా, జేబున్నీసాలు మంచి పేరున్న రచయిత్రులు. వీరు పరిపాలనను కూడా ప్రభావితం చేశారు. శివాజీ తల్లి జిజియా భాయి యోధురాలిగాను, పాలకురాలిగాను చాటుకున్న సమర్ధత వలన సమర్ధురాలైన రాణిగా, మంచి తల్లిగా గణతి కెక్కింది. దక్షిణ భారత దేశంలో చాలామంది మహిళలు గ్రామాలు, పట్టణాలు, మండలాలను పాలించారు. అనేక సామాజిక మత సంస్థలకు ఆద్యులయ్యారు.

భక్తి ఉద్యమం మహిళల హోదాని తిరిగి నిలపడానికి ప్రయత్నించి, కొన్ని రకాల అణచి వేతలను అడ్డుకుంది. మీరాబాయి అనే ఒక మహిళా సాధు కవయిత్రి భక్తి ఉద్యమం ముఖ్య వ్యక్తులలో ఒకరు. ఈ కాలపు ఇతర మహిళా సాధు -- కవయిత్రులు అక్క మహా దేవి, రామి జానాభాయి, లాల్ దేడ్. భక్తి హిందూ మతానికి మాత్రమే పరిమితమైంది. మహానుభవ్, వర్కారి ఇంకా అనేక ఇతర అంశాలు హిందూ మతంలోని నియమ ఉద్యమాలు, ఇవి స్త్రీ పురుషుల మధ్య ఉన్న సామాజిక న్యాయాన్ని సమానత్వాన్ని బహిరంగంగా చర్చించేవి.

భక్తి ఉద్యమం సిక్కుల మొదటి గురువు గుణానికి కూడా స్త్రీ పురుషుల మధ్య సమానత్వాన్ని గురించిన సందేశాన్ని బోధించారు. ఆయన స్త్రీలు కూడా మాట పరమైన సమావేశాలు నిర్వహించడం లోను, గుడిలో కీర్తన లేదా భజనలు అని పిలవబడే గీతాలను పాడడం, నిర్వహించడం లోను మాట ని-

ర్వాహక కమిటీలలో సభ్యులవడం లోను, యుద్ధరంగంలో సైన్యాన్ని నడపడంలోనూ, పెళ్లి అమ్రిత్ లలోను సమానత్వం ఉండాలని సూచించారు. ఇతర సిక్కు గురువులు కూడా మహిళా వివక్షకు వ్యతిరేకంగా ప్రబోధించారు.

చారిత్రక ఆచారాలు :

ఆధునిక భారత దేశంలోనూ కొన్ని వర్గాలలోని సతీ సహగమనం, జౌహర్, దేవ దాసీ వంటి ఆచారాలు నిషేధించబడ్డాయి. అయినప్పటికీ భారత దేశంలో మారుమూల ప్రాంతాలలో ఈ ఆచారాలు ఇప్పటికీ ఉన్నాయి. కొన్ని వర్గాల భారతీయ మహిళలు పరదా సాంప్రదాయాన్ని ఇంకా పాటిస్తున్నారు. ముఖ్యంగా భారతీయ చట్టాల కింద చట్ట వ్యతిరేక చర్యలయినప్పటికే బాల్య వివాహాలు ఇంకా కొనసాగుతున్నాయి.

సతీ సహగమనం:

సతీ సహగమనం ప్రాచీనమైన ఆచారం. ఇది అంతరించిపోయిందనే చెప్పచ్చు.

జౌహర్ అంటే ఓడిపోయిన వీరుడి భార్యలు, కూతుళ్లు. శత్రువులకు దొరికి వేధింపులకు గురికాకుండా తమంతట తామే సొంతంగా బలయిపోవడం. ఈ ఆచారం అధిక స్థాయి గౌరవాన్ని పొందే రాజా పుత్ర రాజులు ఓడిపోయినప్పుడు వారి భార్యలు పాటించేవారు.

పరదా:పరదా అంటే కొన్ని వర్గాలలో మహిళలు వారి దేహాన్ని కనపడకుండా కప్పుకుని అవసరం గల ఆచారం. కొన్ని ప్రాంతాలలో స్వచ్ఛందంగా పాటించినా కొన్ని ప్రాంతాలలో ఆంక్షలను విధిస్తుంది.

దేవదాసీలు: దేవదాసి అనేది దక్షిణ భారతావనిలో కొన్ని చోట్ల ఉన్న మతాచారం. వీరు దేవాలయ సేవా కార్యక్రమాలలో పాల్గొంటూ ఉండేవారు. ఇందులో స్త్రీలు గుళ్లో దేవుడిని పెళ్లి చేసుకునేవారు. తరువాత కాలంలో భారత దేశంలో కొన్ని ప్రాంతాలలో దేవ దాసీల మీద చట్ట విరుద్ధమైన లైంగిక వేధింపులు సహజమయ్యాయి. ఆధునిక కాలంలో ఈ దేవ దాసీ వ్యవస్థ రద్దయ్యింది.

బ్రిటిష్ పాలన: యూరోపియన్ పరిశోధకులు 19వ శతాబ్దపు హిందూ స్త్రీలు మిగతా స్త్రీల కంటే "సహజంగా శీలవంతులు, ఎక్కువ ధర్మ పరులు అని గమనించారు. బ్రిటిష్ పాలన సమయంలో రామ్ మోహన్ రాయ్, ఈశ్వర చంద్ర విద్యాసాగర్, జ్యోతిరావు పులే మొదలైన సంఘ సంస్కర్తలు మహిళా అభ్యున్నతికి పోరాడారు. అలాగే విధవళ పరిస్థితిలో మార్పుకు చేసిన ఉద్యమం 1856 విధవ పునర్వివాహ చట్టానికి దారితీసింది. 1917లో మొదటి మహిళా సభ్య బృందం స్టేట్ సెక్రటరీని కలిసి మహిళలకు రాజకీయ హక్కులను డిమాండ్ చేసింది. వీరికి భారత జాతీయ కాంగ్రెస్ మద్దతు పలికింది. 1927లో పూణేలో అఖిల భారత మహిళా విద్యా సదస్సు జరిగింది. 1929 లో బాల్య వివాహ నియంత్రణ చట్టం అమల్లోకి వచ్చింది.

మహాత్మా గాంధీ 13 ఏళ్లకే పెళ్లి చేసుకున్నప్పటికీ, ప్రజలను బాల్య వివాహాలను బహిష్కరించాలని పిలుపునిచ్చి, యువకులను బాల విధవలను పెళ్లి చేసుకోవలసిందిగా ప్రోత్సహించాడు.

మహిళలు భారత దేశ స్వాతంత్ర పోరాటంలో ముఖ్య పాత్ర పోషించారు.


స్వాతంత్ర భారత దేశం; నేటి భారతీయ మహిళ విద్య, రాజకీయాలు, మీడియా, కళలు, సంస్కృతీ సేవా విభాగాయాలు, విజ్ఞాన సాంకేతిక రంగాలు వంటి అన్ని రంగాలలో పాల్గొంటోంది. పదిహేనేళ్ల పాటు భారత దేశపు ప్రధాన మంత్రిగా ఉన్న ఇందిరాగాంధీ ప్రపంచంలో ప్రధానమంత్రిగా ఎక్కువ కాలం పని చేసిన మహిళ.

2001 సంవత్సరాన్ని భారత ప్రభుత్వం మహిళా సాధికార సంవత్సరం -- స్వశక్తిగా ప్రకటించింది. మహిళా జాతీయ విధానం 2001 లో అమల్లోకి వచ్చింది.

ఇంకా పూర్తిగా మహిళలు సమానత్వాన్ని ఎంతవరకూ పొందుతున్నారనేది ప్రశ్నార్ధకంగా ఉందని చెప్పక తప్పదు.

వివక్ష పోవాలి పురుషులతో సమానత్వం రావాలి.

# శ్రీ వచన భూషణం



9. సంశ్లేష విశ్లేషంగళ్ ఇరండి-లుమ్ పురుషకారత్వమ్ తోత్తుమ్.

అమ్మవారు పరమాత్మ తో కలసియున్నసమయం లోమాత్రమే కాదు ఎడబాటు సమయంలో కూడా తన పురుషకారత్వం ప్రకాశించింది.

అమ్మవారి యందు కృప(పరులదుఖం చూసి సహించ-లేకపోవడం )పారతంత్ర్యం(స్వామే-రక్షకుడు అనిభావించి శారీరకంగా సేవచేయడం నిరంతరంధ్యానం చేయడం)అనన్యార్హ త్వం(స్వామి వారికి తప్ప ఇతరులకు వశపడకుం-డా ఉంటుంది.)మొ.న గుణములు ప్ర కా శి స్తు న్నా యి . ఈ ల క్ష ణా లు అమ్మ వారిలో స్వామి చెంత ఉన్న అమయంలోనే కాదు ఎడబాటు సమయంలో కూడా ప్రకాశిం చాయి.

. .శ్రీరామచంద్రుడు తండ్రి మాట గా సీతమ్మ తోకలసి 14 సం-వత్సరాలు వనవాసమునకు బయ-లుదేరుతుంటే లక్ష్మణుడు నేనూ వస్తానన్నాడు.రామచంద్రుడు అం-గీకరించలేదు. లక్ష్మణుడు రామ-చంద్రుని పాదాలపైబడి ప్రాధేయ-పడుతూ ప్రక్కనే యున్న సీతమ్మకు వారి తో కూడాకలసి అడవికి వెళ్ళడా-నికి సిఫార్సు చేయమని ప్రార్థించగా సీతమ్మ రామచంద్రుని తోస్వామీ! లక్ష్మణుడు మీసేవ చేస్తూ జీవించే తత్వంగలవాడు.మీరు అతనికి దూరమైతే అసలుబ్రతకలేడు.మీరు మా త్రం అతనిని వదలి ఉండగ-లరా!మీరిరువురి సంబంధం చేప-కునీటికీ గల సంబంధం వంటిది. గాన లక్ష్మణుడు మీతోకూడా ఉండ వలసిన వాడే అంటూ రామచంద్రు-ని చెంతయుండిసీతమ్మ తన పు-రుషకారమును ప్రకాశింపజేసింది.

మరొక సందర్భంలో చి-త్రకూట పర్వత సమీపమున సీతమ్మ వడిలో రామచంద్రుడు నిద్రిస్తు-న్న సమయమున కాకాసురుడు అమ్మవక్షస్థలమును గాయపరచగా రామచంద్రుడు కోపంతో గడ్డిపరక-ను బ్రహ్మాస్త్రంగా మంత్రించి కాకాసు-రునిపై ప్రయోగించగా రక్షించేదిక్కు లేకఅంతా పో..పో..అనితరిమేస్తుం-టే వేరే దారిలేక రామచంద్రుడే దిక్కు అనుకుని ఆయనపాదాల చెంత చేరగా సీతమ్మ చూసేసరికి పద్మ-పురాణం ప్రకారం కాకాసురుని తోక రామచంద్రుని పాదాలవైపు ఉన్నం-దున అతని శిరస్సు రామచంద్రుని పాదాలపై పడేవిధంగా చేసి అతనిని రక్షించమని రామచంద్రుని ప్రార్థిం-చింది ఆవిధంగా తనకు అపకారం చేసిన అసురుని పట్లకూడా తన పు-రుషకారమును ప్రకాశింపజేసింది.

రావణుడు సీతమ్మ ను ఎత్తుకు వచ్చి లంకలో బంధించి తన సొంతంచేసుకోవాలని ప్రయ-త్నంలో భాగంగా అతనివల్ల,అతని సిబ్బంది వల్ల అనేక కష్టాలు భరించి దుఖిస్తూ రామచంద్రునే తలు-చుకుంటూధైర్యంగా నిలబడింది. రామచంద్రుడు రావణుని సంహ-రించిన తదుపరి సీతమ్మ చెంతకు వచ్చి అమ్మా !మిమ్మల్ని బాధించిన రాక్షస స్త్రీలను శిక్షిస్తా అనుమతిం-చమని ప్రార్థించగా ఆమె అంగీ-కరించలేదు. వారిఉద్యోగధర్మాన్ని వారు నిర్వర్తించారు.ఇందులో వారి తప్పులేదు అంటూ వారికి అపకారం జరగకుండా కాపాడింది. ఈకార-ణంగా భట్టరు వారు సీతమ్మను కీ-ర్తిస్తూ శ్రీ మద్రామాయణ కావ్యంలో నీచరిత్రముందు శ్రీ రాముని చరిత్ర చిన్న దైపోయిందన్నారు

పైవిధంగా రామచంద్రుని తో సీతమ్మ కలసి యున్నసమయం-లో అలాగే ఎడబాటు సమయంలో పురుషకారలక్షణాలు ప్రకాశించా-యని పిళ్ళైలోకాచార్య స్వామి వారు వివరించారు.

# వేదుల సుబ్రహ్మణ్యం



# (వి)నాయకత్వము

ఉ. మొన్నటినాటి యెన్నికల ముచ్చట లింకను తీరకుండనే
కన్నుల ముందుభారతము కన్పడ జొచ్చెను మంతనమ్ములిం
కెన్నిటి జూడబోదుమొ! మరెన్ని తతంగములుండ బోవునో
భిన్నములైన పైఖరుల పెద్దలు సైతమెరుంగ రారొకో! ॥ 1

ఉ. మొన్నటి ప్రాభవంబు నెటొ మూలనపెట్టి సమాజమెల్ల సం
పన్నము జేయగల్గు పెనుబాధ్యత నర్హత చూడకుం డిడన్
భిన్నపు భావనల్ మరియు భేదము లుద్భవమౌగ సంఘ వి
చ్ఛిన్నపు భావముల్ బలిసి జేయు నకృత్యము లోపనౌదునే! ॥ 2

ఉ. "ఏక్షణమూడునో పదవి యెవ్వడు నేరములంటగట్టి యే
శిక్షకు కారకుండగునొ! చిక్కగ రా"దను సంభ్రమంబునన్
శిక్షను మోయుటెట్టులను చింతయె కాని ప్రజోపకార సం
రక్షణ గుర్తురాని పెదరాయుల ప్రాపకమెంత యొప్పగున్? ॥ 3

చం.వరములు జల్లులై కురిసి వాక్కులుగా మదికింపు నింపి తా
మురియగ జేసి యెల్లరను మోహమునందున నెట్టు వక్తనే
సరియగు పాలకుండనుచు సమ్మతితో గెలిపింప తానెటో
మరుగున బాధ్యతన్ మరచి మంతనముల్ కొనసాగ నేర్పడే! ॥ 4

చం. పదవుల బట్టి పైకెగసి బారలు సాచి ప్రగల్భముల్ సభా
సదనములెల్ల దద్దరిలు స్థాయిని గొంతును చించు పల్కులే
పెదవులు దాటి యావిరయి పిమ్మట వాయు విలీనమైన నా
డొదిగిన దేదిలేక జనులొక్క దినంబు ధ్వజంబు నెత్తరే! ॥ 5

ఉ. తప్పు క్షమించరానిదని తథ్యము శిక్షకు పాత్రమౌనటం
చెప్పటికప్పుడెల్లరకు హెచ్చరిక న్నిడు వారె యొక్కచో
మెప్పుకులొంగిపోయి మితిమీరిన తప్పులు జేయ నేదియో
ముప్పుకు దగ్గరై తుదకు మోయకబోదురె శిక్ష నెల్లరున్? ॥ 6

ఉ. తప్పును జేసి వెంట తనతప్పునెరింగియు నూరకుండి వే
రెప్పుడొ గుర్తు జేసికొని యెంతగ నేడ్చిన న్యాయమొప్పునే!
తప్పని కాళ్ళుబట్టుకొని తన్నులుతిన్నను నీతిహీనమౌ
తప్పో నరించు నష్టమును తానిక పూడ్చగలండె జన్మలన్?॥ 7

ఉ. చెల్లని చిల్లి గవ్వయిన జేబున లేని క్షణంబు తాను వే
రెల్లర జూసి ధీరుడయి యెందుల కీగతి నాకికంచు తా
నుల్లము గట్టిజేసికొని యొక్కదినంబు స్వశక్తి మీర శో
భిల్లగ సంపదల్ వడసి పేదల కండగనుండ బోవునే? ॥ 8

ఉ. న్యాయము గోరి యెంతయొ ప్రయాసకునోర్చి జనంబుచేర నే
మాయనొగప్పి వారినొక మభ్యమునన్ బడవైచు వార లే
శ్రేయము గూర్పనేర్తురొకొ! చెల్లునె పాలకులిట్లు చేయగన్!
నాయకుడైనవాని మది నమ్మకద్రోహము చేయదెన్నడున్ ॥ 9

చం. ప్రజల ప్రయోజనంబులకు ప్రాణముసైతం మొసంగు ధీరుడై
స్వజనమునుండి దూరమయి సంపదలెల్ల తృణీకరించి ది
గ్గజమగు నాయకుండయి ప్రగాఢ ప్రమోదము కల్గు శ్రేయముల్
ప్రజలకు జేసిచూపగల ప్రాభవమున్న మహాత్ము మెచ్చుదున్ ॥10





RNI No. APTEL/2011/39497 AUGUST 2022 POSTAL NO. HSE/1043/2017-19
Date of Publication: 1st August Date of Posting: 8th August



Published, Edited and Printed by T Shanti at Flat No. 45058, Janapriya Utopia, Hyderguda, Attapur, Hyderabad-500048. Phone 9490571297 email: teega51@gmail.com , www.chaitanyam.net, Printed at Planographers, 5-8-300, Chirag Ali Lane, Abids, Hyderabad-500001.